# సంఘ సంస్కరణల కేంద్రం

## మా లక్ష్యం

**ఒకవేళ**

వేషధారణ సంఘాన్ని అసంబద్ధంగా మారుస్తుంది అనుకొంటే, నిశ్చయత, జ్ఞానవృద్ధి చేయగల ఉపదేశం మరియు సౌవార్తీకరణలకు కృపాసహితమైన శుద్ధత లేదా నిర్మలత్వం అనేది ఒక ప్రాముఖ్యమైన సాధనం. అయినా ఈ రోజుల్లో ఆ శుద్ధత తరచుగా నిర్లక్ష్యం చేయబడుతుంది అనుకొంటే,

**అప్పుడు.**

క్రీస్తుసంఘాన్ని కొని అది ఏ విధంగా ఉండాలని ఆశించాడో ఆ విధంగా ఒక సౌందర్యవతియైన వధువుగా ఉండాలని సంఘానికి పిలుపు నివ్వడమే మా పని, మా లక్ష్యం. సంఘ కాపరులకు మరియు ఇతర సంఘ నాయకులకు ఈ విషయాన్ని బోధించి దానిని అమలు చేయగలుగునట్లు వారిని ప్రోత్సహించడం ద్వారా మేమీ లక్ష్యాన్ని సాధిస్తాం.

## మా ఉద్దేశ్యం

ఈ రోజులలో చాలా మంది విశ్వాసులలో దేవుని వాక్యం యొక్క అధికారానికి ప్రాధాన్యత పెరగడం వల్ల లౌకికత్వం వృద్ధి చెందడం, డినామినేషన్‌ల పట్ల మూఢ నమ్మకం తగ్గిపోయి ఆచారాలను సంప్రదాయాలను ప్రశ్నించడం మొదలుపెడుతున్నారు. సంఘాన్ని గూర్చి పునరాలోచించడానికి వారు సంకోచించడం లేదు. బాహాటంగా మాట్లాడడానికి వెనుకాడడం లేదు. పైగా సంఘాన్ని గూర్చిన వాస్తవాలను గూర్చి తెలుసుకోవాలన్న తృష్ణ వారిలో ఉంది. కాబట్టి ఒక ఆరోగ్యవంతమైన, మరియు వాక్యానుసారమైన విధానంలో సంఘాన్ని నిర్వచించడానికి ఇది అనువైన అవకాశం. సంఘకాపరులకు మరియు సంఘ నాయకులకు సంఘమంటే ఉన్న అభిప్రాయాన్ని మార్చాలని "సంఘ సంస్కరణ కేంద్రం" ఆశిస్తున్నది. ఆరోగ్యకరమైన సమాజాల విలువ మీద దృష్టిని తిరిగి కేంద్రీకరించాలని మేము కోరుకొంటున్నాం. దేవుని వాక్యంలోని సిద్ధాంతాలను జాగ్రత్తగా అధ్యయనం చేసి దానిని సంఘంలో ఆచరణలో పెట్టాలని మేము కోరుతున్నాం.

ఆదర్శవంతమైన స్థానిక సంఘానికి ఉండవల్సిన లక్షణాలను గూర్చి చర్చించడానికి, పరీక్షించడానికి మరియు తర్కించడానికి అవసరమైన విద్యాపరమైన లేదా బోధనాపరమైన వేదికను "సంఘ సంస్కరణల కేంద్రం" సమకూరుస్తుంది. బోధించడంతో పాటు దేవుని వాక్యం చేత నిరంతరం సరిదిద్దబడుతూ పరిపూర్ణతవైపుకు కొనసాగే ఒక 'నమూనా'ను అందించాలని లేదా మీ ముందుంచాలని మేం కోరురుకొంటున్నాం. ఆరోగ్యవంతమైన సంఘ నమూనాను ప్రదర్శించడానికి క్రింది నాలుగు మార్గాలను మేం ఎన్నుకొంటున్నాం.

1. మీడియా: రేడియో, వెబ్‌సైట్, టేప్ పరిచర్య
2. అధ్యయనం: కాన్ఫరెన్స్‌లు, శిష్యరికం లేదా తర్ఫీతు విరామ పాఠశాలలు
3. ప్రచురణలు : పుస్తకాలు, కరపత్రాలు, వ్యాసాలు
4. సేవా కార్యక్రమాలు: "థింక్ ట్యాంక్‌లు", ప్రయాణాలు

# విషయ సూచిక


1. వ్యాఖ్యాన సహిత బోధన

2. బైబిల్ వేదాంత శాస్త్రం లేదా వాక్యానుసారమైన సిద్ధాంతాలు

3. సువార్తను దేవుని వాక్యానుసారంగా అర్థం చేసుకోవడం

4. రక్షణను దేవుని వాక్యానుసారంగా అర్థం చేసుకోవడం

5. సౌవార్తీకరణను దేవుని వాక్యానుసారంగా అర్థం చేసుకోవడం

6. సంఘ సభ్యత్వం అంటే ఏమిటో దేవుని వాక్యాన్ని అనుసరించి గ్రహించడం.

7. దేవుని వాక్యాన్ని అనుసరించి సంఘ క్రమ శిక్షణను అర్థం చేసుకోవడం.

8. క్రైస్తవ శిష్యరికం మరియు పెరుగుదలను గూర్చిన శ్రద్ధాసక్తులు.

9. దేవుని వాక్యానుసారమైన సంఘ నాయకత్వం.

10. ముగింపు

**పరిచయం**

దేవుడు తన మంచితనం మరియు ప్రేమను బట్టి మనలను కేవలం క్రైస్తవులుగా ఉండడానికి మాత్రమే పిలవలేదు. మనం వ్యక్తిగతంగా పాపం చేసినా, ఈ లోకంలో నుండి ప్రత్యేకంగా ఉండడానికి వ్యక్తిగతంగా పిలువబడినా, స్థానికంగా సమాజంగా ఉండడానికి కూడా పిలువ బడ్డాము. క్రొత్త నిబంధనలో ఈ సమాజానికి సంఘం అని పేరు.

ఈనాడు మార్కెట్‌లో విడుదల అవుతున్న అనేక పుస్తకాలు మరియు టివి ఛానల్‌లలో మాట్లాడుతున్న అనేక బోధకులు స్థిరంగా చెప్తున్న విషయమేమిటంటే సంఘం యొక్క లక్షణాలు అంటే ఆరాధనా పద్ధతి, కంప్యూటర్ ప్రోగ్రాం, పుస్తకాలు, సౌండ్ సిస్టమ్, సెమినార్, పరిచర్య, విద్యా కార్యక్రమాలు, ఆలోచనా విధానం, బోధనా విధానం, సిద్ధాంతాలు, సుగుణాలు, వాహనాలు నిలపడానికి పార్కింగ్ స్థలం యొక్క డిజైన్, కార్యనిర్వహణా విధానం మొదలైనవి విజయవంతమైన సంఘానికి నిదర్శనాలు అని అంటున్నారు? ఎవరిమాట నిజం? ఒక సంఘం ఆరోగ్యవంతమైనదో కాదో నీవెలా చెప్పగలవు? మీ సంఘం ఆరోగ్యంతమైనదో కాదో ఎలా చెప్పగలవు? వాక్యానుసారమైన, సరియైన పోషణతో కూడిన మరియు దేవున్ని మహిమ పర్చగలిగిన ఎదుగుదలను ప్రోత్సహించడానికి నీవేం చేయగలవు?

ఈ చిన్న పుస్తకం సంఘాలను మార్చడానికి ఒక సాధనం. దీనిలో ఒక ఆరోగ్యవంతమైన సంఘానికి ఉండవల్సిన తొమ్మిది ప్రత్యేక లక్షణాలను నేను సూచించాను. ఆరోగ్యవంతమైన సంఘానికి ఇవి మాత్రమే ఉంటే చాలదు. ఒక సంఘానికి ఉండాల్సిన లక్షణాలన్నీ ఇవే అని అర్థంకాదు. అవి అతి ప్రాముఖ్యమైన లక్షణాలు అయి ఉండాల్సిన అవసరం కూడా లేదు. ఉదాహరణకు, బాప్తిస్మం మరియు ప్రభు రాత్రి భోజనం వాక్యానుసారమైన సంఘంలో తప్పకుండా ఉండవల్సిన అంశాలు. అయినా వాటిని ఇక్కడ నేరుగా చర్చించడం జరగలేదు. ఎందుకంటే వాస్తవంగా ప్రతి సంఘం వాటిని ఆచరించడానికి ప్రయత్నిస్తుంది. ఇక్కడ చర్చించిన తొమ్మిది అంశాలు వాక్యానుసారమైన స్థిరమైన మరియు ఆరోగ్యవంతమైన ఒక సంఘాన్ని ఇతర బలహీన సంఘాల నుండి ప్రత్యేకపర్చడానికి గుర్తులుగా పనిచేస్తాయి. ఈ తొమ్మిది లక్షణాలు ఈనాడు అతి తక్కువగా కనిపిస్తున్నాయి గనుక మన దృష్టిని వాటి మీద కేంద్రీకరించి మన సంఘాలలో వాటిని పెంపొందించుకోవల్సిన అవసరం ఏర్పడింది.

అయితే ఒకటి మాత్రం నిజం. పరిపూర్ణ క్రైస్తవులు లేనట్టే పరిపూర్ణ సంఘాలు కూడా లేవు. మనం చూసే సంఘాలలో అత్యుత్తమమైనవి కూడా ఆదర్శవంతమైన సంఘానికుండవల్సిన లక్షణాలకు అమడ దూరంలో ఉన్నాయి. సరియైన కార్యనిర్వహణ కాని లేదా ధైర్యంగా బోధించడం కాని త్యాగపూరితంగా ఇవ్వడం కాని లేదా సిద్ధాంతపరమైన పునాది కాని ఒక సంఘం వర్ధిల్లుతుందన్న విషయాన్ని కచ్చితంగా చెప్పలేవు. నిజానికి ఏ సంఘమైనా అది ఉన్నదానికన్నా మంచిస్థాయిలో ఉండగలదు. మన వ్యక్తిగత జీవితాలలో కూడా పాపం మీద పరిపూర్ణ

విజయాన్ని పొందలేం. కాని దేవుని బిడ్డలంగా పాపం మీద విజయం సాధించడానికి చేసే పోరాటం మాత్రం ఆపలేం. అలాగే సంఘాలు కూడా తమ పోరాటాన్ని ఆపకూడదు. ముఖ్యంగా సంఘ కాపరులు మరియు సంఘనాయకులు ఆరోగ్యవంతమైన సంఘాలు నిర్మించాలన్న కోరిక కలిగి దాని కొరకు కష్టపడి పనిచేయాలి. కేవలం ఈ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడమే ఈ పుస్తకం యొక్క లక్ష్యం. ఒక ప్రక్క ఈ విషయాలన్నీ నేను వ్రాసినా మరోప్రక్క మీరు ఇవన్నీ చదివినా ఇద్దరిలోనూ దేవుడు మహిమ పొందాలి.

అమెరికా వారిలో ఉన్న పిడివాదం మరియు ఒక వ్యసనంగా మారిన విజయసాధన స్థానంలో దేవుని విశ్వాస్యత మీద వినయపూర్వకమైన మరియు స్థిరమైన నమ్మకం రావాలి. ముఖ్యంగా ఫలితం గూర్చి ఆలోచించకుండా ఆయన ఆజ్ఞలను పాటించడం మన ప్రాధాన్యత కావాలి. జన సాంద్రత పెరుగుతున్న ప్రాంతాలలో సంఘ స్థాపన చేసే సంఘకాపరులను గుర్తించి వారి శ్రమను ప్రశంసించడం మాత్రమే కాక జన సాంద్రత తక్కువగా ఉన్న మారుమూల ప్రాంతాలలో, పల్లె ప్రాంతాలలో నమ్మకంగా పనిచేసే పాస్టర్లను కూడా గుర్తించి ప్రోత్సహించాలి. పెద్ద పెద్ద ఉజ్జీవ సభలలో వెంట వెంటనే అనేకులు ప్రతిస్పందిస్తుండగా చూచి ఆ బోధకులను మెచ్చుకోవడం మాత్రమే కాదు విలియంకేరి, ఆదోనిరామ్ జడ్సన్ వంటివారు పాటుపడినప్పుడు జరిగిన దేవుని పనిని చూచి వారిని ప్రోత్సహించగలగాలి. **ఒక హెచ్చరిక:** మన సంఘాల లక్ష్యాలను మరియు ఆచారాలను, అలవాట్లను పునఃస్థాపితం చేసేటప్పుడు, దేవుని వాక్యానుసారమైన సంస్కరణలకు సెమినెరీలు ప్రతినిధులని మనం భావించరాదు. సెమినెరీలకు వారి వారి సంస్థాగతమైన జవాబుదారీ తనం ఉంది. వారు దానికి నమ్మకంగా కట్టుబడి ఉండాలి. లేకపోతే వాటి ఉనికికే ప్రమాదం వాటిల్లుతుంది. కాబట్టి నెమ్మదిగా, లోతుగా చాలాకాలం నిలిచి ఉండే మార్పు కొరకు మనం పనిచేయాలి. దేవుడు మహిమ పొందే ఆరోగ్యవంతమైన సంఘాల స్థాపన కొరకైన కోరిక, మరియు ఏక మనస్సు కలిగి ఉండాలి. ఆ సంఘాలలో తన ప్రజల మధ్య దేవుడు మహిమ పొందుతాడు. ఈ పుస్తకం ఆ లక్ష్యాన్ని సాధించడానికి ఉపయోగపడును గాక.

## 1. వ్యాఖ్యాన సహిత బోధన

1. వ్యాఖ్యాన సహిత బోధన యొక్క నిర్వచనం.
2. వ్యాఖ్యాన సహిత బోధన వాస్తవంలో ఒక విధానం కాదు.
3. దేవుని వాక్యానికి లోబడి వాక్యనుసారంగా బోధించాలేగాని బోధకుని స్వంత జ్ఞానంతో కాదు.
4. దేవుడు తన ప్రజలను ఎల్లప్పుడూ తన వాక్యంతో సృష్టించాడు.
5. బోధించబడిన వాక్యం యొక్క కేంద్ర బిందువు లేదా సారాంశం.

ఈ అధ్యయనాన్ని ప్రారంభించవల్సిన స్థానం దేవుడు మనతో ప్రారంభించిన స్థానమే. అంటే అయన మనతో మాట్లాడడం, దాని ద్వారానే మన సంఘాలకు ఆత్మీయ ఆరోగ్యం లభిస్తుంది. ప్రత్యేకంగా సంఘంలో నాయకత్వంలో ఉన్న ఎవరికైనా, ముఖ్యంగా సంఘకాపరికి వ్యాఖ్యాన సహితమైన బోధన పట్ల అంకిత భావం ఉండడం ప్రాముఖ్యమైన విషయం. ఇది పురాతన బోధనా విధానాలలో ఒకటి.

ఒక నియమిత వాక్య భాగాన్ని జాగ్రత్తగా వివరించి దానిని సంఘానికి లేదా ఆ సమయంలో కూడి వచ్చిన సమాజానికి అన్వయించడం ద్వారా ఆ వాక్యభాగంలోని సందేశాన్ని విశదపర్చడమే ఈ బోధనా విధానం యొక్క ఉద్దేశ్యం. (నెహెమ్యా 8:8 చూడండి) అయితే ఇంకా ఎన్నో రకాల బోధనా విధనాలు ఉన్నాయి. ఉదాహరణకు అంశానుసారమైన బోధ! ఏదో ఒక అంశం మీద బైబిల్‌లో ఉన్న వాక్యభాగాలన్నింటిని సేకరించి ఆ అంశం గూర్చి దేవుడేం చెప్తున్నాడో బోధిస్తారు. అంటే ప్రార్ధన, ఇవ్వడం మొదలైన అంశాలన్నమాట. జీవిత చరిత్రలను బోధించే విధానంలో బైబిల్‌లో ఎవరో ఒకరి జీవిత చరిత్రను అధ్యయనం చేసి దేవుని కృపకు దృష్టాంతంగా నిరీక్షణ మరియు విశ్వాస్యతలకు మాదిరిగా దానిని చిత్రీకరించడం చేస్తారు. కాని వ్యాఖ్యాన సహిత బోధన అలా కాదు– దేవుని వాక్యంలో ఒక నియమిత భాగాన్ని తీసుకొని దానిని వివరించి మన జీవితాలకు అన్వయిస్తారు.

వ్యాఖ్యాన సహిత బోధన దేవుని వాక్యం యొక్క అధికారాన్ని నమ్ముతుంది. అయితే అది మాత్రమే కాదు – అంకిత భావంతో వ్యాఖ్యాన సహిత బోధన చేయడమంటే దేవుని మాటలను వినడానికి అంకిత భావమున్నదని అర్ధం. పాత నిబంధనలోని ప్రవక్తలకైనా లేక క్రొత్త నిబంధనలోని అపోస్తులులకైనా కేవలం వెళ్ళి మాట్లాడమని దేవుడు చెప్పలేదు కాని ఒక కచ్చితమైన సందేశాన్ని ప్రకటించమని చెప్పాడు. కాబట్టి ఈ నాటి క్రైస్తవ బోధకులు ఎంతకాలం దేవుని మాటలను యధాతథంగా మాట్లాడుతారో కేవలం అంతకాలమే బోధించడానికి వారికి అధికారముంది. అంటే వ్యాఖ్యాన సహిత బోధనచేసే వారి అధికారం దేవుని వాక్యంతో మొదలై దేవుని వాక్యంతో అంతమవుతుంది. కొన్ని సార్లు వ్యాక్యాన సహిత బోధ చేసే ఒక బోధకుని శైలిని చూసి అదే వ్యాఖ్యాన సహిత బోధ అని కొంతమంది భ్రమ పడతారు. కాని వ్యాఖ్యాన సహితబోధ ఒక శైలి కాదు. చివరికి తేలిందేమిటంటే

వ్యాఖ్యాన సహిత బోధనలో మనం ఏం చెప్తున్నాం, ఎలా చెప్తున్నాం అనేది కాదుగాని ఏం చెప్పాలనేది ఎలా నిర్ణయించుకొంటున్నామనేదే ప్రాముఖ్యమైన విషయం. ఏదో ఒక నిర్ణీత విధానంలో లేదా నిర్ణీత శైలిలో బోధించడం కాదుగాని దేవుని వాక్యాన్ని ఉన్నదున్నట్టుగా బోధించడమే వ్యాఖ్యాన సహిత బోధన.

ఒక వ్యక్తి దేవుని వాక్యం యొక్క అధికారాన్ని సంతోషంగా అంగీకరించవచ్చు మరియు బైబిల్ యొక్క లోప రాహిత్యాన్ని గట్టిగా నమ్మవచ్చు అంటే దేవుని వాక్యంలో ఏ చిన్న తప్పుకాని పొరపాటు కాని లేదని గాఢంగా నమ్మవచ్చు. అయితే అతడు వ్యాఖ్యాన సహితంగా బోధించనట్టయితే తనకు ముందే తెలిసిన దానికన్నా మరేమీ క్రొత్తది అతడు బోధించలేడు. ఒక బోధకుడు ఒక నిర్ణీత వాక్యభాగాన్ని తీసుకొని ఒక ప్రాముఖ్యమైన అంశం మీద సంఘానికి బోధించవచ్చు కాని ఆ వాక్యభాగంలోని సందేశాన్ని అసలు బోదించకనే పోవచ్చు. అలా జరిగితే ఆ బోధకుడు మరియు సంఘం తమకు అంతకు ముందే తెలిసన విషయాలనే వింటారు తప్ప మరేమి నేర్చుకోలేరు. దానికి భిన్నంగా ఒక నిర్ణీత వాక్యభాగాన్ని వ్యాఖ్యాన సహితంగా, సందర్భానుసారంగా బోధించినప్పుడు ఆ వాక్యభాగంలోని ముఖ్య విషయాన్ని సందేశం యొక్క ముఖ్య విషయంగా తీసుకొన్నప్పుడు ఆ బోధన ప్రారంభంలో మనం వినాలని అనుకొనని విషయాలను దేవుని నుండి వింటాం. దేవుని తొలి పిలుపు నుండి పశ్చాత్తాపం వరకు ఇటీవలి కాలంలో మన జీవితంలో ఏదో ఒక రంగంలో ఏదో ఒక విషయమై పరిశుద్ధాత్ముడు మనలను ఒప్పింపచేసిన సంఘటన వరకు అంటే మన పరిపూర్ణ రక్షణ దేవుని మాటలను వినడంలో ఇమిడి ఉంది. దేవుని మాటలను వినడం అంటే ఇంతకు ముందు మనం విన్న విధానాలలోనే కాక మనం ఎన్నడూ ఊహించని విధానాలలో కూడా కావచ్చు. దేవుని వాక్యానికి ఆచరణాత్మకంగా లోబడడం అనేది బోధకుని పరిచర్యలో స్పష్టంగా కనిపించాలి. ఇక్కడ పొరపాటుకు తావు ఇవ్వకండి. బోధకుని పరిచర్య అలా ఉండే విధంగా చూసుకోవడం సంఘం యొక్క బాధ్యత. యేసు ప్రభువు సంఘానికి ఇచ్చిన బాధ్యతను మత్తయి 18లోనూ పౌలు సంఘానికి అప్పగించిన బాధ్యతను 2 తిమోతి 3లోను చూడండి. వాస్తవంలో దేవుని మాటను విని లోబడి, దానిని తన జీవితంలో ఆచరించని వ్యక్తికి మందను కాసే బాధ్యతను సంఘం ఎన్నడూ ఇవ్వకూడదు. అలా చేస్తే సంఘాభివృద్ధికి ఆటంకాలేర్పడడం అనివార్యమన్నమాట. సంఘం కేవలం ఆ బోధకుని స్థాయికి మాత్రమే ఎదిగేలా చేస్తున్నామన్న మాట. అదే పరిస్థితి కొనసాగితే ఆ సంఘం నెమ్మదిగా ఆ బోధకుని ఉద్దేశ్యాలకు అనుగుణంగా మారుతుంది. కాని దేవుని ఉద్దేశ్యాలకు మరియు ఆయన చిత్తానికి అనుగుణంగా ఉండదు.

దేవుని ప్రజలు ఎప్పుడూ దేవుని వాక్యంచేత సృష్టించబడతారు. ఆదికాండం మొదటి అధ్యాయంలో సృష్టికార్యం మొదలుకొని 12వ అధ్యాయంలో అబ్రామును దేవుడు పిలిచేంత వరకు యోహెజ్కేలు 37లో ఎండిన ఎముకల లోయను గూర్చిన దర్శనం మొదలుకొని శరీరధారియైన వాక్యం వచ్చేంత వరకు దేవుడు ఎప్పుడైనా తన ప్రజలను వాక్యం చేత సృష్టించాడు. పౌలు రోమీయులకు ఇలా వ్రాశాడు. “ కాగా వినుట వలన విశ్వాసము కలుగును. వినుట

క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును’. (10:17) అలాగే పౌలు కొరింథీయులకు వ్రాసిన వాక్యం ఇలా ఉంది. “దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవునిని ఎరగకుండినందున, సువార్త ప్రకటనయను వెఱ్ఱితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను. ” (1:21)

సరియైన వ్యాఖ్యాన సహిత బోధన సంఘ అభివృద్ధికి శిఖరాయమానమైంది. మార్టిన్ లూథర్ మాటలలో “దేవుని వాక్యాన్ని జాగ్రత్తగా వినడమే సంస్కరణకు ఆరంభం. మనం కూడా ఎల్లప్పుడూ దేవుని వాక్యానుసారంగా సంస్కరణలు చేసుకొనే సంఘాలుగా ఉండాలి.

ఒకసారి లండన్‌లోని ఒక సంఘంలో ఒక దినం సెమినార్‌లో ప్రసంగిస్తూ కొన్నిసార్లు ప్రసంగం రెండు గంటలపాటు కొనసాగవచ్చు అని అన్నాను. వెంటనే ఒక వ్యక్తి “అలాగైతే స్తుతి ఆరాధనకు సమయమెక్కడుంటుంది? అని ప్రశ్నించాడు. అంటే దేవుని వాక్యాన్ని వినడం అనేది ఆరాధనలో భాగం కాదని అతని నమ్మకం. అప్పుడు నేను “చాలా మంది క్రైస్తవులు తమ మాతృభాషలో దేవుని వాక్యం విని తమ జీవితాలలో దానిని ఆచరించడం వారి ఆరాధనలో ఒక ప్రాముఖ్యమైన భాగం అని భావిస్తారు. అందరు కలిసి పాడి స్తుతించడానికి సమయం ఉన్నాలేకపోయినా పెద్దగా పట్టించుకోరు” అని చెప్పాను.

దేవుని వాక్యమే కేంద్రంగా మన ఆరాధన ఉండే స్థితిని సంఘాలు పునరుద్ధరించుకోవాలి. దేవుని వాక్యం విని దానికి స్పందించడమనేది స్తుతి, కృతజ్ఞత చెల్లించడం, ఒప్పుకోలు మరియు ప్రకటించడం అనే ఏ రూపంలోనైనా ఉండవచ్చు వాటిలో ఏదైనా పాట రూపం కూడా కావచ్చు. కాకపోయినా ఫర్వాలేదు. సంగీతం ఆధారంగా నిర్మించబడిన సంఘం కదిలిపోయే ఇసుక మీద కట్టబడిన సంఘంగా ఉంటుంది. సంఘ కాపరత్వంలో బోధన అతి ప్రాముఖ్యమైన అంశం. మీ సంఘకాపరి దేవుని వాక్యాన్ని తీవ్రంగా, జాగ్రత్తగా, మనఃపూర్వకంగా చదవడానికి అంకితభావంతో ఉండాలనీ అతడు దేవుని వాక్యాన్ని సరిగ్గా అర్థం చేసుకొనేలా మరియు తన జీవితంలో ఆచరించేలా దేవుడు సహాయ పడాలనీ ప్రార్థించండి (లూకా 24:27, అ॥కా 6:4, ఎఫెసి 6:19-20 చూడండి) ఒక వేళ నీవు పాస్టర్‌వైతే నీకొరకు ఆ విషయాలన్నీ ప్రార్థించు.

చివరిగా, వ్యాఖ్యానసహితంగా బోధించబడిన దేవుని వాక్యాన్ని వినాలన్న అంకిత భావం మన సంఘాలకు ఉండాలనీ దానివల్ల దేవుని వాక్యంలో సంఘం పట్ల దేవునికి ఉన్న ఉద్దేశాలే సంఘ ఉద్దేశ్యాలుగా మారాలని ప్రార్థించండి. వ్యాఖ్యాన సహిత బోధనకు అంకితం కావడం ఆరోగ్యవంతమైన సంఘ లక్షణం.

**పర్యాలోకనకు (ఆలోచించడానికి) ప్రశ్నలు**

1. నెహెమ్యా 8:7-8 చదవండి. ధర్మశాస్త్ర గ్రంథాన్ని ప్రజలకు చదివి వినిపించినప్పుడు లేవీయులు ఏం చేశారు? సమావేశం ముగిసిన పిమ్మట ప్రజలు 'సంభ్రమముగా' ఉన్నారని 12వ వచనంలో వ్రాయంబడింది. ఈ వాక్యభాగాన్ని అనుసరించి వారెందుకు 'సంభ్రమముగా' ఉన్నారు?

2. "ఒక నిర్ణీత వాక్య భాగాన్ని వివరించి దానిని జీవితానికి అన్వయించడం అనేది వ్యాఖ్యాన సహిత బోధనకు రచయిత ఇచ్చిన నిర్వచనం. ఈ నిర్వచనాన్ని మీ స్వంత మాటలలో చెప్పండి. వ్యాఖ్యాన సహిత బోధనకు ఇతర బోధనా పద్ధతులకు భేదమేమి

3. అపోస్తలుల కార్యములు 20:27లో దేవుని 'సంకల్పమంతయు ' వారికి బోధించబడడానికి తాను శ్రమించానని పౌలు వారికి బోధించడానికి తాను శ్రమించానని పౌలు ఎఫెసీయులకు వ్రాశాడు. సంఘ నాయకులముగా మన సంఘం పట్ల మన బాధ్యత కూడా అదే అని మనం గుర్తించినప్పుడు వారికి దేవుని 'సంకల్పమంతయు' తెలియజేయడానికి వ్యాఖ్యాన సహిత బోధన మనకెలా సహాయ పడగలదు?ఒకవేళ బోధించిన వాక్య భాగంలోని ముఖ్యాంశం మన ప్రసంగం యొక్క ముఖ్యాంశం కాకపోతే జరిగే ప్రమాదమేమి?

4. ఆదికాండం 1వ అధ్యాయం నుండి క్రొత్త నిబంధన వరకు దేవుడు తన ప్రజలనెప్పుడు తన వాక్యం ద్వారా సృష్టించాడు. రోమా 10:17 మరియు 1 కోరింథి 1:21 చదవండి ప్రజలను రక్షణార్ధమైన విశ్వాసంలోకి నడిపించడానికి దేవుడు దేనిని వాడుకొంటాడు? సంఘంలో దేవుని వాక్యానికి ఇవ్వవల్సిన స్థానం గూర్చి అది మనకేం చెప్తుంది? ఆ స్థానం వాస్తవంగా మన బోధనలో ఏవిధంగా ప్రతిఫలిస్తుంది?

## 2 దేవుని వాక్యానుసారమైన వేదాంత శాస్త్రం లేదా వాక్యానుసారమైన సిద్ధాంతాలు

1. సరియైన సిద్ధాంతం
2. ఏకత్వం, భిన్నత్వం మరియు దాతృత్వం
3. సంక్లిష్టమైన లేదా వివాదాస్పదమైన సిద్ధాంతాలను సంభాళించడం.
4. దేవుని సార్వభౌమాధికారానికి నిరోధం
5. దేవుని సార్వభౌమాధికారాన్ని నాయకులు అంగీకరించాలి. దానికి హత్తుకోవాలి.

ఒక సంఘం యొక్క ఆరోగ్యానికి వ్యాఖ్యాన సహిత బోధన చాలా ప్రాముఖ్యమైనది. అయినా ప్రతి పద్ధతి అది ఎంత మంచిదైనా విమర్శలకు లోనవుతుంది. గనుక పరీక్షించదానికి అది అందుబాటులో ఉండాలి. మన సంఘాలలో ఎలా బోధిస్తున్నామని మాత్రమే కాక ఏమి బోధిస్తున్నామో జాగ్రత్తగా చూసుకోవాలి. ముఖ్యంగా బైబిల్‌లో ప్రత్యక్షపర్చబడిన దేవున్ని మరియు ఆయన మనతో ప్రవర్తించే విధానాన్ని అర్థం చేసుకోవడం సరియైన విధంగా ఉండేలా చూసుకోవాలి.

"సరియైన సిద్ధాంతం" అనేది ఒక పాత పదం. పౌలు తిమోతికి మరియు తీతుకు వ్రాసిన పత్రికలలో సరియైన సిద్ధాంతం" అంటే నమ్మదగిన, కచ్చితమైన మరియు ప్రామాణికమైన సిద్ధాంతం అని అర్థం. ప్రాథమికంగా పరిపూర్ణమైన లేదా ఆరోగ్యవంతమైన అని భావం. సరియైన సిద్ధాంతం సువార్త చేత రూపించబడి పాపాన్ని, అపవిత్రతను వ్యతిరేకిస్తుందని మనం 1 తిమోతిలో చదువుతాం. 1 తిమోతి 6:3లో పౌలు అబద్ధ బోధనలను వ్యతిరేకిస్తూ, దైవ భక్తికి అనుగుణ్యమైన బోధను అంగీకరించమని చెప్పాడు. తిమోతికి వ్రాసిన 2వ పత్రికలో "నీవు నా వలన వినిన హితవాక్య ప్రమాణమును గైకొనుము" అని హెచ్చరించాడు. (2 తిమోతి 1:13) జనులు హితబోధను సహింపక, దురదచెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగుచేసుకొని సత్యమునకు చెవినియ్యక కల్పనా కథలవైపునకు తిరుగు కాలము" వస్తుందని పౌలు తిమోతిని ముందుగానే హెచ్చరించాడు (2 తిమోతి 4:3)

తీతు అనే మరొక యౌవనస్థుడైన పాస్టర్‌కు పౌలు వ్రాసినప్పుడు ఇటువంటి అభిప్రాయాలనే వ్యక్తం చేశాడు. ఒక వేళ తీతు ఎవరినైనా నాయకునిగా నియమిస్తే "హితబోధ విషయమై జనులను హెచ్చరించుటకును, ఎదురాడువారి మాట ఖండించుటకును శక్తి గల వాడగునట్లు, ఉపదేశమును అనుసరించి నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టుకొనగలవాడినే నాయకునిగా నియమించాలని పౌలు అతనికి ఉద్బోదించాడు. (తీతు 1:9)

అబద్ధబోధకులు విశ్వాస విషయములో స్వస్థులగునట్లు వారిని గద్దించాలని కూడ పౌలు తీతుకు చెప్పాడు. (తీతు 1:13) అలాగే "హితబోధకు అనుకూలమైన సంగతులను బోధించుము" అని కూడా హెచ్చరించాడు (తీతు 2:1).

వాస్తవంలో ప్రతి సంఘం కూడా ఏయే విషయాలలో సంపూర్ణంగా ఏకీభవించాలో, ఏ విషయాలలో కొంత వరకు భిన్నాభిప్రాయాలు ఉండవచ్చో, ఏ విషయాలలో పూర్తి స్వాతంత్ర్యం తీసుకోవచ్చో ముందే నిర్ణయించుకోవాలి.

మా సంఘంలో యేసు క్రీస్తు చేసిన రక్షణ కార్యం ద్వారా మాత్రమే రక్షణ లభిస్తుందని అందరం ఏకీభవిస్తాం. అలాగే బాప్తిస్మం విషయంలో కూడ ! రక్షణ విషయంలో కాని సంఘం యొక్క ఆచరణాత్మక విషయాలలో కాని పూర్తిగా ఏకీభవించాలి. అత్యవసరం కాని విషయాలలో కొంత వరకు భేదాలున్నా ఒప్పుకోవచ్చు. ఉదాహరణకు క్రీస్తు రెండవ సారి తిరిగి వస్తాడని అందరం ఒప్పుకొంటాం. కాని ఆయన ఏ సమయంలో వస్తాడనే విషయమై భిన్నాభిప్రాయాలుంటే ఆశ్చర్యపోనవసరం లేదు. హెబ్రీయులకు వ్రాసిన పత్రిక రచయిత ఎవరు అనే అంశం మీద మనకు ఏకాభిప్రాయం లేకున్నా ఫర్వాలేదు. సాధ్యమైనంత స్వేచ్ఛ తీసుకోవచ్చు.

ఇదంతా పరిశీలించిన తర్వాత దానిలోని సూత్రం చాలా సరళంగా ఉంది. అత్యవసరమైన. అతి ప్రాముఖ్యమైన విసయాలలో ఏకత్వం, అత్యవసరం కాని విషయాలలో భిన్నత్వం, అన్ని విషయాలలో దాతృత్వం ఉండాలి.

సరియైన బోధన అంటే స్పష్టంగా వాక్యానుసారమైనవైనా నిర్లక్ష్యం చేయబడిన అంశాల పట్ల నిబద్ధత కలిగి ఉండడం కూడా ఉంటుంది. బైబిల్‌లోని సరియైన సూత్రాలను కూడా మనం తెలుసుకోవల్సి ఉంటుంది. ఎందుకంటే మనలో దేవుని కార్యం గ్రహించడానికి అవి పునాది వంటివి.
దేవుని వాక్యం జవాబివ్వగల అనేక ప్రశ్నలు నిర్లక్ష్యం చేయబడ్డాయి. అవి:

1. మానవులు మంచివారా చెడ్డవారా? వారికి ప్రోత్సాహం మరియు స్వాభిమానం కావాలా లేక పాపక్షమాపణ మరియు నూతన జన్మ, నిత్యజీవం అవసరమా?
2. సిలువ మీద మరణించడం ద్వారా యేసుక్రీస్తు ఏం చేశాడు? మన కొరకు ఎవరినైనా ఎంపిక చేసుకొనే అవకాశమిచ్చాడా లేక మనకు ప్రతిగా మనస్థానంలో ఉన్నాడా?
3. ఒక వ్యక్తి క్రైస్తవుడైనప్పుడు అంటే క్రీస్తునంగీకరించినప్పుడు ఏం జరుగుతుంది?
4. ఒక వేళ మనం క్రీస్తునంగీకరిస్తే దేవుడు మనపట్ల శ్రద్ధ కలిగి మన బాగోగులు చూసుకొంటాడని నమ్మవచ్చా? అలాగైతే ఆయనకు మనపట్ల ఉన్న శ్రద్ధ లేక కృపాకనికరాలు మన విశ్వాస్యత మీద ఆధారపడి ఉంటాయా లేక ఆయన విశ్వాస్యత మీద ఆధారపడి ఉంటాయా?

ఈ ప్రశ్నలన్నీ వేదాంత విద్యనభ్యసించే వారికి లేక యౌవనస్థులైన సెమినరీ విద్యార్థులకు మాత్రమే అవసరమైనవి కావు. అవి ప్రతి క్రైస్తవునికీ ప్రాముఖ్యమైనవే. ఈ ప్రశ్నలలో దేని జవాబైనా మారిపోతే మన కాపరత్వంలో ఎంత భేదమొస్తుందో కాపరులుగా ఉన్నవారు గుర్తించగలరు. ఈ విషయాలను గూర్చి మనం స్పష్టంగా, అధికార పూర్వకంగా మాట్లాడగలగడం దేవుని వాక్యం పట్ల మన విశ్వాస్యతకు, నమ్మకత్వానికి చిహ్నం.

బైబిల్ దేవుని గూర్చి ఏమి బోధిస్తుందనే విషయమై మనకున్న గ్రహింపు చాలా కీకలమైనది. బైబిల్‌లో ఉన్న దేవుడు సృష్టికర్త మరియు ప్రభువు. అయినా ఆయన సార్వభౌమాధికాం కొన్ని సార్లు అలక్ష్యం చేయబడుతుంది- సంఘంలో కూడ. క్రీస్తునంగీకరించిన విశ్వాసులు సృష్టికార్యంలో మరియు రక్షణ కార్యంలో దేవుని సార్వభౌమాధికారాన్ని కాదనడమంటే విగ్రహారాధనత్వంతో ఆటలాడడమే. చాలామంది క్రైస్తవులకు దేవుని సార్వభౌమాధికారం గూర్చి యదార్థమైన ప్రశ్నలుండవచ్చు కాని దేవుని సార్వభౌమాధికారాన్ని ధిక్కరించడాన్ని తేలికగా తీసుకోరాదు. అటువంటి వ్యక్తికి బాప్తిస్మ మివ్వడమంటే కొన్ని విషయాలలో దేవున్ని ఇంకా నమ్మని వ్యక్తికి బాప్తిస్మమివ్వడమన్నమాట. అటువంటి వ్యక్తులను సంఘంలో చేర్చుకోవడమంటే వారు దేవున్ని నమ్మకపోయినా నమ్మినట్టుగా మనం భావిస్తున్నామన్న మాట.

అటువంటి నిరోధం ఒక క్రైస్తవునిలో లేదా సాధారణ సంఘ సభ్యునిలో ఉన్నదానికంటే ఒక క్రైస్తవ నాయకునిలో ఉంటే చాలా ప్రమాదకరం. దేవుని సార్వభౌమాధికారాన్ని నమ్మని వ్యక్తిని లేదా సందేహించే వ్యక్తిని ఈ విషయాలలో సరియైన అవగాహన లేని వ్యక్తిని నాయకునిగా చేయడమంటే, దేవున్ని నమ్మడానికి సందేహించే వ్యక్తిని లేదా ఇష్టపడని వ్యక్తిని ఒక మాదిరిగా నిలబెట్టడం అన్నమాట. అటువంటి నియామకం సంఘానికి అవరోధంగా మారుతుంది.

ఈనాడు తరచుగా సౌవార్తీకరణను ఒక ప్రకటన (అడ్వర్టయిజ్‌మెంట్) గాను ఆత్మకార్యాన్ని మార్కెటింగ్ గానూ చూసే సంస్కృతి వచ్చింది. స్వయంగా దేవున్నే ఒక వ్యక్తి రూపంలో చూస్తారు. అంటే వ్యక్తులను దేవునిలా ఆరాధిస్తారు. అటువంటప్పుడు ఆరోగ్యవంతమైన సంఘం నాయకుల కొరకు ప్రార్థించే విషయంలో జాగ్రత్తపడాలి. దేవుని సార్వభౌమాధికారాన్ని గూర్చిన వాక్యానుసారమైన గ్రహింపు మరియు ఆచరణాత్మక అనుభవం గల నాయకుల కొరకు ప్రార్థించాలి. వ్యాఖ్యానాత్మక బోధన మరియు వాక్యానుసారమైన వేదాంతశాస్త్రం లేదా వాక్యానుసారమైన సిద్ధాంతాలు ఒక ఆరోగ్యవంతమైన సంఘం యొక్క లక్షణాలు.

**ఆలోచించవల్సిన ప్రశ్నలు**

1. 1 తిమోతి 6:3-5 చదవండి తప్పుసిద్ధాంతాలను బోధించే వారిని పౌలు ఏ విధంగా వివరించాడు? తిమోతి తన వారికి 'హిత వాక్యములను' మరియు దైవభక్తికి అనుగుణ్యమైన బోధను అందించడం ప్రాముఖ్యమైన విషయమని పౌలు ఎందుకు భావించాడు?

2. ఒక వ్యక్తి తన సంఘ సభ్యుడు కావాలంటే నమ్మవల్సిన అనేక సిద్ధాంతాలను ఈ పుస్తక రచయిత పేర్కొన్నారు. అలాగే నమ్మాలా వద్దా అనే విషయంలో సంఘ సభ్యులకు పూర్తి స్వేచ్ఛ ఉన్న విషయాలను కూడా రచయిత పేర్కొన్నారు. మరి మీ సంఘంలో సభ్యులు కావాలనుకొనే వారు నమ్మవల్సిన సిద్ధాంతాలు ఏవి? అవి మీ సంఘాన్ని ఇతర సంఘాల నుండి ఏ విధంగా ప్రత్యేక పరుస్తాయి?

3. నిస్సందేహంగా దేవుని వాక్యంలో ఉండి కూడా పాటించడానికి కష్టమైనందున నిర్లక్ష్యం చేయబడిన సిద్ధాంతాలున్నాయి. వివాదస్పదమైనందున వాటిని గూర్చి సంఘంలో మాట్లాడకపోవడం లేదా బోధించకపోవడం సరియైనదేనా? అయితే ఎందుకు? కాకపోతే ఎందుకు?

4. ఈ అధ్యాయంలో ఇవ్వవల్సినంత ప్రాధాన్యత ఇవ్వబడని 4 ప్రశ్నలను రచయిత పేర్కొన్నాడు. ఈ ప్రశ్నలకు బైబిల్ ఏమి సమాధానం ఇస్తుందని నీవు భావిస్తున్నావు? మీ జవాబులకు తగిన వాక్యాధారాలను (రెఫెరెన్సులు) సూచించండి.

5. నాయకుడు “ఉపదేశమును అనసరించి నమ్మదగిన బోధన గట్టిగా చేపట్టుకొనువాడై ఉండవలెను”. అని పౌలు తీతు 1:9 లో వ్రాశాడు. రక్షణ కార్యంలో దేవుని సార్వభౌమాధికారాన్ని సంఘకాపరి లేదా నాయకులు గ్రహించి దానిని హత్తుకొని ఉండడం ప్రాముఖ్యమైన విషయమని మీరనుకొంటున్నారా? ఈ విషయంలో దేవుని సార్వభౌమాధికారాన్ని సందేహించే వ్యక్తిని లేదా ఈ విషయంలో వాక్యానుసారమైన బోధనను సరిగ్గా అర్ధం చేసుకొనని వ్యక్తిని నాయకునిగా చేయడం వల్ల ప్రమాదమేమిటి?

## 3. సువార్తను గూర్చి వాక్యానుసారమైన గ్రహింపు

1. క్రైస్తవ్యానికి ఆయువుపట్టు సువార్త.
2. దేవుడు, మానవుడు, క్రీస్తు, స్పందన
3. రక్షణ యొక్క క్రియాశీల బహుమానం సువార్త

సంఘ జీవనంలో ఒక ప్రత్యేకమైన విషయంలో వాక్యానుసారమైన సిద్ధాంతాన్ని గ్రహించడం ప్రాముఖ్యమైన విషయం. అదేమిటంటే యేసు క్రీస్తు యొక్క సువార్తను గూర్చి మనకున్న గ్రహింపు. సువార్త క్రైస్తవ్యానికి గుండెలాంటి దయితే మన విశ్వాసానికి కూడా గుండెలాంటిదే. క్రైస్తవులముగా మనం సంఘజీవితంలో ఏమి చేసినా చేయకపోయినా క్రీస్తుద్వారా లభించిన రక్షణను గూర్చిన అద్భుత సువార్త విషయమై చాలా జాగ్రత్తగా ఉండాలని మనందరం ప్రార్థించాలి. ఒక ఆరోగ్యవంతమైన సంఘం సువార్త కొరకు హృదయాన్నిచ్చే వారితో నిండి ఉంటుంది. అంటే సత్యానికి హృదయాన్నిచ్చే వారు. ఆ సత్యం ఏమిటంటే మన అవసరత నిమిత్తం తన్నుతాను ప్రత్యక్ష పర్చుకొన్న దేవుడు క్రీస్తుగా మనకు అందించబడడం మరియు దానిపట్ల మన బాధ్యత.

నేనెవరికైనా సువార్తనందిస్తే నాలుగు విషయాలను జ్ఞాపకముంచుకోవడానికి ప్రయత్నిస్తాను. అవి దేవుడు, మానవుడు, క్రీస్తు, స్పందన. నేను ఈ వ్యక్తితో మన పరిశుద్ధ దేవున్ని గూర్చి సార్వభౌమాధికారియైన సృష్టికర్తను గూర్చి పంచుకొన్నానా? మానవులముగా మనం దేవుని పోలికలో చేయబడినా పతనమైన వింత జీవులమనీ, పాపంతో ఆయనకు దూరమయ్యామని చెప్పానా? అని ప్రశ్నించుకొంటాను. నేను మాట్లాడుతున్న వ్యక్తికి క్రీస్తును గూర్చి గ్రహింపు ఉందా? ఆయన దైవమానవుడనీ, దేవునికీ మనిషికీ మధ్య మధ్యవర్తి అని మనకు ప్రతిగా సిలువ శిక్షను భరించిన వాడనీ మరణాన్ని జయించి పునరుత్థానుడైన ప్రభువనీ అతనికి లేదా ఆమెకు తెలుసా? చివరిగా ఈ విషయాలన్నీ నేను ఈ వ్యక్తికి వివరించినా దానికి ప్రతిస్పందించాలని అతనికి లేదా ఆమెకు తెలుసా? ఈ సందేశాన్ని విని పాపం నుండి స్వనీతి నుండి వెనుతిరగాలన్న గ్రహింపు ఉందా అని ఆలోచిస్తాను.

క్రైస్తవేతరులకు స్వతహాగా వారు కోరుకొనేదాన్ని (సంతోషం, సమాధానం, సంతృప్తి, ప్రేమ మొదలైనవి) ఇవ్వడం కొరకు సువార్తనందించడం కొంత వరకు మాత్రమే సత్యం. ఒక సగం సత్యం పూర్తి సత్యంగా ముసుకు వేసుకొంటే పూర్తి సత్యం కూడా అసత్యమైపోతుందని జె.ఐ. ప్యాకర్ అన్నారు. స్థూలంగా ప్రతి ఒక్కరికి పాప క్షమాపణ అవసరం. మనకు ఆత్మీయ జీవితం కావాలి. దీనికన్నా తక్కువ క్రియాశీల రూపంలో సువార్తనందిస్తే అబద్ధ మారుమనసును ప్రోత్సహించినట్టవుతుంది. అది సంఘ సభ్యుల సంఖ్యను అర్థం లేకుండా పెంచుతుంది. దాని వల్ల మన చుట్టు ఉన్న ప్రపంచం యొక్క సౌవార్తీకరణ మరింత కష్టమవుతుంది.

వివిధ గృహాలలో, ఆఫీసులలో ఉన్న మన సంఘ సభ్యులు ఆదివారం రోజున సంఘంలో కలుసుకొనే ఇతర క్రైస్తవుల సంఖ్యకన్నా, ఇతర దినాలలో వారు కలుసుకొనే క్రైస్తవుల సంఖ్యనే అధికంగాఉంటుంది. మనందరి దగ్గరా అద్భుతమైన రక్షణ సువార్త ఉంది. మరేదో దాని కొరకు మనం సువార్తను వ్యర్థం చేయరాదు. ఈనాడే దానిని అందరితో పంచుకొందాం.

ఒక ఆరోగ్యవంతమైన సంఘం, సువార్తను ఎరిగిన సంఘం, ఆరోగ్యవంతమైన సంఘం-సువార్తను పంచుకొంటుంది.

**ఆలోచించదానికి ప్రశ్నలు**

1. క్రైస్తవులముగా మనం మన సంఘ జీవనంలో మరే ఇతర విషయం కన్నా ఎక్కువగా క్రీస్తుద్వారా లభించిన రక్షణ సువార్తను గూర్చి శ్రద్ధ కలిగి ఉండాలి. మీరీ విషయంలో ఏకీభవిస్తారా? 1 కొరింథి 2:2 చదవండి. యేసు క్రీస్తును గూర్చిన సందేశం ఎందుకు ప్రాముఖ్యమైనది ?
2. ఒకవ్యక్తి సువార్తను గూర్చి దేవుని వాక్యానుసారమైన గ్రహింపు కలిగి ఉండాలంటే దేవున్ని గూర్చి ఏమి గ్రహించాలి? మానవుని గూర్చి, పాపంలో అతని స్థితిని గూర్చి ఏమి గ్రహించాలి? క్రీస్తును గూర్చి ఏం తెలుసుకోవాలి? మార్కు 1:15 లోని క్రీస్తు ప్రభువు మాటల ఆధారంగా సువార్త పట్ల మానవుని స్పందన ఏ విధంగా ఉండాలి? ఆ స్పందన లోని రెండు ప్రధాన భాగాలలో ఏమి ఉంది?
3. "దీని కన్నా తక్కువ క్రియాశీల రూపంలో సువార్తనందిస్తే అబద్ధపు మారుమనసును ప్రోత్సహించినట్లవుతుంది. దీనివల్ల సంఘ సభ్యుల సంఖ్య అర్థం లేకుండా పెరుగుతుంది" అని రచయిత అన్నాడు. ఈ " క్రియాశాల సువార్త" అంటే ఏమిటి? కొన్ని సార్లు క్రైస్తవేతరులకు సువార్త నందించేటప్పుడు వారు ఎక్కువ సంతోషంగా ఉండడానికి తమను గూర్చితాము మంచిగా ఆలోచించదానికి వీలుగా సువార్త మార్చబడుతుంది. దానికి క్రియాశీల సువార్తకు బేధమేమి?
4. నశించిన వారికి సువార్త నందించే విషయంలో మీ సంఘం ఎంత తీవ్రంగా పనిచేస్తుంది?

## 4. మారుమనస్సును గూర్చిన వాక్యానుసారమైన గ్రహింపు

1. పశ్చాత్తాపం మరియు విశ్వాసం
2. మారుమనస్సంటే దేవుడు మనలో చేసే కార్యం
3. "ప్రభువు వారిలో నీవొకడవు కావు !"
4. సంఘం యొక్క "వ్యతిరేక సాక్ష్యం"
5. "మారు మనస్సుకు" నిదర్శనం దాని ఫలాలు

1878లో మా సంఘ తొలి సమావేశంలో మేమొక విశ్వాస ప్రమాణాన్ని రూపొందించుకొన్నాం. అది 1833లో రూపొందించబడిన న్యూ హ్యాంప్‌షైర్ విశ్వాసప్రమాణం యొక్క మేలైన రూపం. ఈ విశ్వాస ప్రమాణమే బాప్టిస్టు విశ్వాసానికి మరియు సందేశానికి ఆధారమయ్యింది. 1925లో జరిగిన దక్షిణ బాప్టిస్ట్ కన్వెన్షన్‌లో రూపొందించబడిన విశ్వాస ఒడంబడికకు ఆ తర్వాత 1963లో పునరుద్ధరించబడి బలహీనమైన విశ్వాస ఒడంబడికకు అదే పునాది. దానిలోని ఆర్టికల్ 8లో ఇలా ఉంది.

"పశ్చాత్తాపము మరియు విశ్వాసం పవిత్రమైన ధర్మాలు మరియు విడదీయరాని సుకృతాలు పునరుజ్జీవింపచేయగల దేవుని ఆత్మ మన ఆత్మలలో చేసే కార్యాలు దానివల్ల మన అపరాధస్థితి, మనమున్న ప్రమాదకర స్థితి మరియు మన నిస్సహాయతలను గూర్చిన ఒప్పుదల కలిగి క్రీస్తు ఇచ్చే రక్షణ ద్వారా నిష్కపటమైన పశ్చాత్తాపముతో దేవుని వైపు తిరిగి పాపం ఒప్పుకొని, ఆయన కృపను వేడుకోవాలి. అదే సమయంలో ప్రభువైన యేసు క్రీస్తును మన ప్రభువుగాను, యాజకునిగాను మరియు రాజుగాను హృదయ పూర్వకంగా స్వీకరించి అన్నింటికీ చాలిన రక్షకుడు ఆయనే మాత్రమే నని ఆయన మీదనే ఆధారపడాలి.

ఈ విశ్వాసప్రమాణంలో మన మారుమనస్సును గూర్చి ఏం చెప్పబడిందో గమనించండి. మనం మన అపరాధముల విషయం, వాటి వల్ల మనం ప్రమాదంలో పడిన విషయం మరియు మన నిస్సహాయతలను బట్టి ఒప్పించబడడం వల్ల దేవుని వైపుకు తిరుగుతాం. ఆ తిరగడం-అంటే పశ్చాత్తాపం మరియు విశ్వాసముల కలబోత అయిన ఆ తిరగడం ఎలా జరుగుతుంది? 'పునరుజ్జీవింపచేయగల దేవుని ఆత్మ మన హృదయాలలో మరియు ఆత్మలో ఆ కార్యం చేస్తాడు. ఈ అభిప్రాయాన్ని బలపర్చే రెండు వాక్యభాగాలున్నాయి. అపొస్తలుల కార్యములు 11:18 "వారు ఈ మాటలు విని మరేమి అడ్డము చెప్పక" అన్యజనులకును దేవుడు జీవార్థమైన మారు మనస్సు దయచేసిఉన్నాడని చెప్పుకొనుచు దేవుని మహిమపరిచిరి". అలాగే ఎఫెసి 2:8లో ఇలా ఉంది "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షించబడి ఉన్నారు. ఇది మీ వలన కలిగినది కాదు దేవుని వరమే."

ఒక వేళ రక్షణ అంటే దేవుడు మనలో చేసిన కార్యమని కాక మనం చేసే పని అని అనుకొంటే అది తప్పు అభిప్రాయమే. మారుమనస్సులో మన పాత్ర కూడ ఉంది. మనం మనఃపూర్వకంగా ఒక ఒడంబడిక చేయాలి. ఒక నిర్ణయం తీసుకోవాలి. అయినా మారుమనస్సు అంటే అది మాత్రమే కాదు. మనంతట మనం దేవుని వైపుకు ప్రయాణించలేమని వాక్యం స్పష్టంగా తెలియజేస్తుంది. కొందరు మార్గాలను కనుగొన్నారు. ఇంకొందరు ఇంకా వెదుకుతున్నారు. వాక్యం ఏం చెప్తుందంటే మన హృదయం స్థానంలో క్రొత్త హృదయం రావాలి, మనసు రూపాంతరం చెందాలి, మరియు మన ఆత్మ జీవం పొందాలి. దీనిలో మనం ఏదీ చేయలేం. కేవలం ఒక నిర్ణయం చేయగలం. అయితే మరి మనం రక్షించబడాలి. పైకి ఎవరు ఎలా కనబడినా ప్రతి వ్యక్తికి అవసరమైన మార్పు వారి మూలాలలో ఎంత సమూలంగా ఎంత క్రియా శీలకంగా ఉండాలంటే అది కేవలం దేవుడు మాత్రమే చేయగలడు. మనం రక్షించబడి మారుమనస్సు పొందడానికి మనకు దేవుడు అవసరం.

స్పర్జన్ భక్తుడు ఒకసారి లండన్ వీధిలో నడిచి వెళ్తున్నప్పుడు ఒక త్రాగుబోతు ఎదురై ఆయన ప్రక్కన ఉన్న దీప స్తంభానికి ఆనుకొని "హాయ్ స్పర్జన్ గారు! నేను మీ పరిచర్య ద్వారా రక్షించబడిన వారిలో ఒకడిని " అన్నాడట. అప్పుడు స్పర్జన్ "బహుశానీవు నా వల్ల మారుమనస్సు పొందిన వాడిని కావచ్చు కాని దేవుని వల్ల మాత్రం కాదు" అన్నాడట.

వ్యాక్యానుసారమైన రక్షణ, మారుమనస్సులను గూర్చి సరియైన అవగాహన లేకపోవడం వల్ల కలిగే పరిణామాలలో ఒకటి – కొన్ని సంఘాలు ప్రజలతో నిండి పోయాయి. వారు తమ జీవితంలో మారు మనస్సు పొందాలన్న నిర్ణయం చేసుకొన్నారు. కాని దేవుని వాక్యం బోధించే మారుమనసు అనే సమూలమైన మార్పు యొక్క అనుభవం వారు పొందలేదు. ఇటీవలి కాలంలో జరిపిన సర్వే ఆధారంగా దక్షిణ బాప్టిస్టు డినామినేషన్‌లో విడాకుల రేటు దేశంలోని సగటు విడాకుల రేటుకన్నా అధికంగా ఉందని తేలింది. క్రీస్తును అనుసరించే వారి యొక్క ఈ "వ్యతిరేక సాక్ష్యానికి" కారణం పూర్తిగా కాకున్నా కొంతవరకైనా రక్షణ మారుమనస్సును గూర్చి వాక్యానుసారమైన బోధన లేకపోవడం.

మారు మనస్సు అంటే ఖచ్చితంగా ఉద్వేగ భరితమైన అనుభవం కానవసరం లేదు. ఒక వేళ అది బైబిల్ బోధించే నిజమైన మారుమనసు అయితే దాని ఫలాలే దానికి నిదర్శనంగా ఉంటాయి దేవుని వాక్యానుసారమైన మారు మనస్సును అర్థం చేసుకోవడం ఆరోగ్యవంతమైన సంఘం యొక్క ఒక లక్షణం.

## పర్యాలోకనకు ప్రశ్నలు

1. అపొస్తలుల కార్యములు 11:18 చదవండి: పశ్చాత్తాపం యొక్క ఆవిర్భావం గురించి ఈ వాక్యభాగం ఏమి బోధిస్తుంది? అది మనిషి తనంతట తాను దేవుని వైపుకు తిరగాలని చేసుకొనే నిర్ణయమా లేక పునరుజ్జీవింపజేయగల దేవుని ఆత్మ మానవ హృదయంలో చేసే కార్యమా?
2. ఆదికాండం 6:5 మరియు రోమా 8:7 చదవండి. పాప బంధకాకలలో ఉండే మానవ హృదయం యొక్క స్థితిని వర్ణించండి. దేవున్ని సంతోషపెట్టడానికి లేదా ఆయన వైపు తిరగడానికి మానవునికున్న సామర్థ్యం గురించి బైబిల్ ఏం చెప్తుంది?
3. ఎఫెసి 2:1–10 చదవండి. రక్షణ పొందిన తర్వాత మన హృదయాలలో దేవుడు గొప్ప మార్పును కలుగజేస్తాడు. ఆ మార్పును ఈ వాక్యభాగం ఎలా వివరిస్తుంది? మానవుడు ఎంత గొప్ప ప్రయత్నంచేసినా తనంతట తాను ఈ మార్పును కలిగించగలడా?
4. ఇటీవలి కాలంలో జరిపిన సర్వే ప్రకారం అమెరికాలోని ఎవాంజలికల్ క్రైస్తవులలో విడాకుల రేటు దేశంలోని విడాకుల సగటు రేటు కన్నా అధికంగా ఉన్నట్టు తెలిసింది. దానికి ఒక కారణం చెప్పగలరా? ఒక వ్యక్తి జీవితంలో దేవుని ఆత్మ జరిగించే పునరుజ్జీవ కార్యానికి నిదర్శనంగా కనిపించే ఫలాలను గూర్చి బైబిల్ ఏమి చెప్తుంది?
5. గత శతాబ్దాలలో యుక్తవయసుకు వచ్చిన వారికి యధాలాపంగా బాప్తిస్మమిచ్చేవారు. ఈ శతాబ్దంలో ఆ వయసులో తగ్గుదల కనిపించడానికి కారణమేమై ఉండవచ్చు? దాని ప్రత్యేకత

## 5. సౌవార్తీకరణను దేవుని వాక్యానుసారంగా అర్థం చేసుకోవడం

1. నిర్లక్ష్యం యొక్క పరిణామాలు
2. మారుమనసును గూర్చిన సరియైన అవగాహన వల్ల రూపించబడిన సౌవార్తీకరణ.
3. సౌవార్తీకరణ యొక్క నిర్వచనం
4. దేవుడే మనషులను మారుస్తాడు (మారుమనస్సు కలిగిస్తాడు)
5. సంఘానికి వచ్చేవారి సంఖ్యకన్నా సభ్యత్వ సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు
6. వివరించవల్సిన మూడు సత్యాలు
7. ఆధారాలు

ఒకసారి గత పాఠాలను పునశ్చరణ చేసుకొంటే ఒక ఆరోగ్యవంతమైన సంఘానికి ఉండవలసిన లక్షణాలలో వ్యాఖ్యాన సహితమైన బోధన, వాక్యానుసారమైన సిద్ధాంతాలు, సువార్తను మరియు మారు మనసును రక్షణను దేవుని వాక్యాను సారంగా అర్థం చేసుకోవడం అనే వాటిని మనం అధ్యయనం చేశాం. అవి ఎంత ప్రాముఖ్యమైనవో అర్థం చేసుకోవాలంటే వాటిని నిర్లక్ష్యం చేసిన సంఘాలలో కలిగిన పరిణామాలను పరిశీలించాలి. అవి ఏవంటే ఇంతకు ముందే తెలిసిన సత్యాలను ఏ కరువు పెట్టే ప్రక్రియగా ప్రసంగాలు మారిపోతాయి. చుట్టూ ఉన్న ప్రపంచానికి క్రైస్తవ సమాజానికి మధ్య భేదం లేకుండా పోతుంది. ఆత్మీయంగా ఎవరికి వారు చేసుకోగలిగిన మార్పుగా సువార్త తిరిగి చెప్పబడుతుంది. రక్షణ అనేది దేవుని కార్యంగా కాక మానవ నిర్ణయంగా మారిపోతుంది. అటువంటి సంఘాలు పైపై జ్ఞానము గల బోధనతో లౌకికమైన ఆలోచనలతో, క్రీస్తును రక్షకునిగా నోటితో ఒప్పుకొని అంగీకరిస్తే చాలని చెప్పే స్వార్థపూరితమైన సువార్తతో రక్షణను ప్రకటించడంలో విఫలమౌతాయి.

సంఘంలోని సభ్యులందరికి మరిప్రత్యేకంగా బోధించగల ఆధిక్యత మరియు బాధ్యత కలిగిన నాయకులకు సౌవార్తీకరణను గూర్చిన సరియైన అవగాహన కీలకమైంది. ఒకవేళ నీ మనసులో దేవుని గూర్చి, సువార్తను గూర్చి రక్షణను గూర్చి మానవుడు రక్షణ పొదవల్సిన ఆవశ్యకతను గూర్చి దేవుని వాక్యనుసారమైన అవగాహన ఉంటే సౌవార్తీకరణను దేవుని వాక్యానుసారంగా అర్థం చేసుకోవడం సహజ సిద్ధంగా జరగుతుంది.

దేవుని వాక్యాన్ని అనుసరించి సౌవార్తీకరణ అంటే సువార్తను స్వేచ్ఛగా ప్రకటించడం మరియు ప్రజల హృదయాలలో తానే కార్యం చేసి మారుమనస్సు కలిగిస్తాడని దేవుని యందు నమ్మకముంచడం (అ॥కా 16:14 చూడండి) రక్షణ దేవుని నుండి వస్తుంది (యోనా 2:9, యోహాను 1:12) ఏది ఏమైనా మారుమనస్సు కలిగించాలని మనం ప్రయత్నిస్తే, ఎండిన ఎముకలను యెహెజ్కేలు ఒకదానికొకటి కూర్చినట్టు, నికొదేము తనంతట తాను తిరిగి జన్మించడానికి ప్రయత్నించినట్టు ఉంటుంది. వాటన్నిటి ఫలితం ఒక్కటే.

రక్షణ అనేది యదార్థంగా చేసే ఒక నిర్ణయంగా మనం భావిస్తే ప్రతి ఒక్కరినీ ఆ విధంగా నోటితో ఒప్పుకొని మారు మనస్సు పొందాలన్న నిర్ణయానికి వచ్చేలా ఏదో ఒక విధంగా చేయగలం. దేవుని వాక్యాన్ని అనుసరించి మనం రక్షించబడని వారిపట్ల శ్రద్ధ వహించి, వారిని బ్రతిమిలాడి వేడుకొని, బలవంతంగా సువార్త నందించే ప్రయత్నం చేసినా మనకు దేవుడిచ్చిన సువార్తను ఉన్నదున్నట్టుగా వారికందించడం మన ప్రథమ కర్తవ్యమై ఉండాలి. ఆ సువార్తను మన మందిస్తే దేవుడు మనసులను మారుస్తాడు. (యోహాను 1:13, అ॥కా 18:9-10 చూడండి)

ఒక వేళ ఏదైనా సంఘంలో సభ్యత్వం తీసుకున్న వారి కన్నా ఆరాధనకు వచ్చేవారి సంఖ్య తక్కువగా ఉంటే ఆ సంఘానికి రక్షణను గూర్చి వాక్యానుసారమైన అవగాహన ఉందా? అని ప్రశ్నించాలి, తర్వాత ఏ పద్ధతిలో సౌవార్తీకరణ జరిగిందో తెలుసుకోవాలి. ఎందుకంటే దాని ఫలితంగానే అధిక సంఖ్యాకులు సంఘ జీవనంలో పాల్గొనకుండా ఉంటారు, కాని తమ వ్యక్తిగత రక్షణకు సంఘ సభ్యత్వం ఋజువుగా భావిస్తారు. ఆ పరిస్థితిని సంఘం ఆక్షేపిస్తుందా లేక మౌనంగా ఉంటుందా? దేవుని వాక్యానుసారమైన క్రమశిక్షణ సంఘ సౌవార్తీకరణలో భాగమే

నేను సువార్తనందించేటప్పుడు సువార్త విషయంలో ప్రజలు తీసుకోవల్సిన నిర్ణయం గూర్చి వారికి మూడు విషయాలు చెప్పాలని ఆశిస్తాను.

1. మొదటిది – ఆ నిర్ణయం కొరకు ఎక్కువ వెల చెల్లించాలి (కాబట్టి చేసే ముందు జాగ్రత్తగా ఆలోచించాలి లూకా 9:62 చూడండి).
2. రెండవది – ఆ నిర్ణయం ఆలస్యం చేయరానిది (కాబట్టి వెంటనే చేయాలి. యోహాను 3:18, 36 చూడండి)
3. మూడవది– ఆ నిర్ణయం విలువైంది, యోగ్యమైంది (కాబట్టి తప్పక చేయవల్సింది. యోహాను 10:10 చూడండి.

సౌవార్తీకరణను గూర్చి శ్రేష్ఠమైన వనరులు అందుబాటులో ఉన్నాయి. నేనైతే విల్‌మెట్‌జెస్ వ్రాసిన "టెల్ ది ట్రూత్" అనే పుస్తకాన్ని మరియు అయాన్ మెర్రీ వ్రాసిన ది ఇన్‌విటేషన్ సిస్టమ్ మరియు రివైవల్ అండ్ రెవైవలిసం అనే పుస్తకాలను సిఫారసు చేస్తాను.

కాబట్టి ఆరోగ్యవంతమైన సంఘం యొక్క మరొక లక్షణం – సౌవార్తీకరణను దేవుని వాక్యానుసారంగా అర్థం చేసుకోవడం. దేవుని ద్వారా కలిగే అభివృద్ధి మాత్రమే నిజమైన అభివృద్ధి.

## పర్యాలోకనకు (ఆలోచించడానికి ) ప్రశ్నలు

1. సువార్తను స్వేచ్ఛగా అందించి, ప్రజలను మార్చడం దేవునికే అప్పగించడమే సౌవార్తీకరించడాన్ని అని రచయిత నిర్వచించాడు. రక్షణ కార్యం చేసేది దేవుడని మనసులను మార్చేది. ఆయనే అనే గ్రహింపు మన సౌవార్తీకరణను ఏ విధంగా ప్రభావితం చేస్తుంది? చివరికి మారుమనసు పొందాలన్న ఎంపిక మరియు నిర్ణయం మానవునిదే అని భావిస్తే మన సౌవార్తీకరణ ఎలా ఉంటుంది?

2. మీ సంఘ సభ్యుల సంఖ్యకన్నా ఆరాధనకు వచ్చే వారి సంఖ్య తక్కువగా ఉందా? ఆలాగైతే దానికి కారణ మేమిటని అనుకొంటున్నావు? మీ సంఘం సువార్తను సమతుల్యతతో ఆరోగ్య కరమైన విధానంలో అందిస్తుందా?

3 క్రీస్తును వెంబడించాలన్న నిర్ణయానికి చాలా ఎక్కువ విలువ చెల్లించాలని చెప్పడంలో రచయిత ఉద్దేశమేమి?

## 6. సంఘ సభ్యత్వం అంటే ఏమిటో దేవుని వాక్యానుసారంగా గ్రహించడం

1. బైబిల్‌లో సభ్యత్వం
2. సభ్యత్వం తీసుకోవడం అనేది అంకిత భావంతో కూడిన చర్య.
3. సభ్యత్వానికి మరియు చురుకుగా అన్ని విషయాలలో పాల్గొనడానికి మధ్య పెద్ద అగాధముంది.
4. సభ్యత్వమనేది ఒక బాధ్యత
5. సభ్యత్వమనేది రక్షణకు ఒక సాక్ష్యం
6. అర్ధవంతమైన సభ్యత్వం.

ఒక విధంగా చూస్తే మనం ఈనాడు సంఘ సభ్యత్వం అని భావించేది నిజానికి వాక్యానుసారమైనది కాదు. మొదటి శతాబ్దపు క్రైస్తవులు ఏదో ఒక సంఘానికి మాత్రమే చెందిన వారుగా ఉన్నట్టు ఆధారాలేవీ లేవు. ఆ రోజుల్లో " సంఘ షాపింగ్" అనేది లేదు. అంటే అందుబాటులో ఉన్న సంఘాలలో ఇష్టమొచ్చిన సంఘాన్ని చూసుకొని వెళ్ళే అవకాశం లేదు. ఎందుకంటే ఒక ప్రాంతంలో ఒకే సంఘముండేది. క్రొత్త నిబంధనలో సంఘ సభ్యుల జాబితా ఎక్కడా కనిపించదు. అయితే సంఘంతో అనుబంధంగా ఉండే వ్యక్తులను గూర్చి క్రొత్త నిబంధనలో పేర్కొనబడింది. వారు ఎవరంటే సంఘం సహాయం చేసిన విధవరాండ్రు కావచ్చు (1 తిమోతి 5) లేదా గొఱ్ఱెపిల్ల యొక్క జీవగ్రంథంలో పేర్లు నమోదు చేయబడిన వ్యక్తులు కావచ్చు. (ఫిలిప్పి 4:3, ప్రకటన 21:27) సంఘ సభ్యత్వము యొక్క నిర్వచనం మరియు దాని పరిమితులను గూర్చి వివరించే వాక్యభాగాలు క్రొత్త నిబంధనలో ఉన్నాయి. ఉదాహరణకు పౌలు కొరింథీయులకు వ్రాసిన పత్రికలలో కొంతమంది వ్యక్తుల పేర్లు సంఘ సభ్యత్వం నుండి తీసివేయాలని (1 కోరింథి 5) మరి కొంతమందిని చేర్చాలనీ (2 కొరింథి) సూచించాడు (2 కొరింథి 2:6) లో శిక్షించబడిన వారిని గూర్చి పౌలు వ్రాస్తున్నాడు. అది సంఘ బహిష్కరణయే కావచ్చు. 'ఎక్కువ మంది' అన్న పదం సంఘసభ్యులనుద్దేశించి వ్రాయబడి ఉండవచ్చు.

సంఘ సభ్యత్వం తీసుకోవడమనే వాడుక ఒకరిపట్ల ఒకరికున్న బాధ్యత మరియు ఒకరిపట్ల ఒకరు చూపించుకోవల్సిన ప్రేమను గుర్తించడం కొరకు ఉద్దేశించబడింది. ఒక సంఘంలో సభ్యులముగా చేరుతున్నామంటే ఆ సంఘంలో ఆరాధనకు క్రమంగా వస్తామని ప్రార్థనలో ఇవ్వడంలో మరియు ఇతర కార్యకలాపాలలో పాల్గొంటామనీ ఆ సంఘ కాపరికి మరియు నాయకులకు తెలియజేస్తున్నామన్నమాట అంతే కాక మన బాధ్యత ఆ సంఘానికి ఉంది అని కూడ చెప్తున్నామన్న మాట. సంఘంతో కలిసి క్రీస్తును సేవించడంలో మనకున్న నిబద్ధతను తెలుపుతూ వారు కూడా ప్రేమతో మనకు సేవలనందించి మన శిష్యరికంలో మనలను ప్రోత్సహించాలని కోరుతాము.

ఈ భావంలో సంఘ సభ్యత్వం అనేది వాక్యనుసారమైంది. పౌలు సంఘాన్ని శరీరంతో పోల్చిన వివరణ నుండి అది ప్రారంభమైంది. క్రీస్తు కృపతో మనలను రక్షించి సంఘంలో భాగంగా ఉంచి ఇతరులకు ప్రేమతో పరిచర్యం చేయడం ద్వారా ఆయనను సేవించాలని ఉద్దేశించడం వల్ల వచ్చింది. పౌలు 'ఒకరి నౌకరు' అంటూ వ్రాసిన మరియు 'ఏకత్వం' గూర్చి వ్రాసిన వాక్యభాగాల ఆధారంగా అది ఏర్పడింది.

ఒక సంఘ సభ్యత్వానికి మరియు చురుకుగా అన్ని కార్యకలాపాలలో పాల్గొనే వారికీ మధ్య చాలా అంతరముండడం అసాధారణ మేమీ కాదు. ఒక సంఘంలో **3000** మంది సభ్యులుంటే, దానిలో **600** మాత్రమే క్రమంగా గుడికి వస్తారు. చాలా మంది సంఘ కాపరులు క్రమంగా ఆరాధనకు వచ్చేవారి సంఖ్య తగ్గిపోవడాన్ని బట్టి బాధపడక  సంఘ సభ్యుల జాబితా చూసి గర్వించడం బాధకలిగించే విషయం. ఇవ్వడం విషయంలో మనం మేలైన స్థితిలో ఉన్నామా? ఏ సంఘంలోనైనా సంఘ సభ్యులందరి మొత్తం రాబడికి సంఘ రాబడి సమానంగా ఉందా? లేక కనీసం **10%** అయినా ఎక్కువగా ఉందా?

ఒకవేళ బాహ్య పరిస్థితులను బట్టి ఆరాధించేవారి సంఖ్య తగ్గడం లేదా ఆర్థిక సమస్యలను బట్టి ఇవ్వడమనేది తగ్గిపోవడం జరిగిన చోట తప్ప సంఘ సభ్యత్వం ఒక తప్పనిసరి వ్యవహారం కాదని పరిస్థితులు సూచించడం లేదా?  సభ్యుల సంఖ్యకు అర్థమేమిటి? చలనం లేని విగ్రహాలకు అది సమానం కాదా? అయితే దేవుడు మన జీవితాలను పరీక్షించి బేరీజు వేసి మన పనిని నిగ్గుతేలుస్తాడు తప్ప సంఖ్యలను చూడడు.  సంఘం ఒక కట్టడమైతే మనం దానిలో ఇటుకలం కావాలి. సంఘం శరీరమైతే మనం అవయవాలం కావాలి. ఒక వేళ సంఘం విశ్వాస గృహమైతే మనం దానిలో భాగమై ఉండాలి. మందలో గొఱ్ఱెలుంటాయి, ద్రాక్షావల్లిలో కొమ్మలుంటాయి. ఒక వ్యక్తి క్రైస్తవుడైతే అతడొక సంఘంలో సభ్యుడుగా ఉండాలనేది వాక్యానుసారమైన విషయం. ఇవన్ని  పక్కనుంచితే మన సంఘ సభ్యుల జాబితా నోటీస్ బోర్డుమీద ఉందా లేక కంప్యూటర్‌లో  ఉందా అనేది ప్రాముఖ్యమైన విషయం కాదు.  క్రమంగా ఆరాధనకు హాజరుకావడం మనం మానుకోకూడదు (హెబ్రీ **10:25**) సభ్యత్వమనేది ఒక సజీవమైన ఒడంబడికకు ప్రతీకగా ఉండాలి. లేకపోతే దానికి విలువలేదు. పైగా అది ప్రమాదకరమవుతుంది.

సంఘానికి క్రమంగా రాకుండా సంఘ కార్యకలాపాలలో పాల్గొనకుండా ఉండేవారు అటు క్రైస్తవులను ఇటు క్రైస్తవేతరులను అయోమయంలో పడేసి క్రైస్తవుడంటే ఎవరో అర్థం కాకుండా చేస్తారు. ఒక వ్యక్తి సంఘంలో సభ్యుడయ్యాడంటే అతని వ్యక్తిగత రక్షణకు ఆ సంఘం సాక్ష్యమవుతుంది. అయితే సంఘానికి రాకుండా ఎప్పుడూ కనిపించకుండా ఉండే వ్యక్తి ఎలా జీవిస్తున్నాడో సంఘానికి ఎలా తెలుస్తుంది? జీవితమనే పరుగుపందెంలో అతడు నమ్మకంగా పరుగెదుతున్నాడా లేదా సంఘానికి ఎలా తెలుస్తుంది? ఒక వ్యక్తి మన సంఘానికి రాకుండా ఇంకే సంఘానికీ వెళ్ళకుండా ఉంటే అతడు మనలో భాగమని ఎలా చెప్పగలం? వారు నరకానికే వెళ్తారని అనలేముకాని వారు పరలోకానికి వెళ్తారో లేదో చెప్పలేం.

ఒక సంఘం వాక్యానుసారమైన సంఘ సభ్యులను కలిగి ఉండాలంటే పరిపూర్ణత అవసరం లేదు కాని నమ్మకత్వం కావాలి. కేవలం నిర్ణయం తీసుకోవడం కాదు కాని నిజమైన శిష్యరికం కావాలి. వ్యక్తిగత అనుభవాలు కాదు కాని దేవునితోనూ ఒకరితో ఒకరు చేసుకునే ఒడంబడికకు కట్టుబడి ఉండాలి. పేరుకు సంఘ సభ్యులుగా ఉన్నవారు నిజంగా సంఘ సభ్యులైతే అప్పుడు సభ్యత్వం అర్థవంతంగా మారుతుంది. నేనలా అన్నప్పుడు చాలా మంది మా సంఘ జాబితా నుండి వైదొలగారు కాని మరి కొంత మంది తమ ఒడంబడికకు పునరంకితం చేసుకొని మా సంఘ జీవనంలో భాగమయ్యారు. ఫలితంగా మా సంఘ సభ్యుల జాబితాలో ఉన్న సంఖ్యకన్నా అధిక సంఖ్యలో సభ్యులు ఆరాధనకు వస్తున్నారు. మీ సంఘం విషయంలో మీ కోరిక కూడా అదే అయి ఉంటుందని నమ్ముతున్నాను.

జాగ్రత్తతో కూడిన సవరణలు చేసిన సభ్యత్వం వల్ల చాలా ఉపయోగాలున్నాయి. అది క్రైస్తవేతరుల ముందు మన సాక్ష్యాన్ని స్పష్టం చేస్తుంది. బలహీనమైన గొఱ్ఱెలు తాము మందలో భాగమే అనుకొంటూ దారి తప్పిపోవడం నిరోధిస్తుంది. పరిణితి చెందిన క్రైస్తవులు శిష్యరికం మీద తమ దృష్టి కేంద్రీకరించేలా చేస్తుంది. తాము ఎవరిపట్ల బాధ్యత కలిగి ఉండాలో నాయకులకు తెలుస్తుంది. వీటన్నిటిలో దేవుడు మహిమపర్చబడతాడు.

సంఘ సభ్యత్వమంటే ఆచరణాత్మకంగా క్రీస్తు శరీరంలో భాగం కావడం. అంటే ఈ లోకంలో పరదేశులముగా కలిసి ప్రయాణిస్తూ మన పరలోక గృహం చేరుకుంటాము. ఆరోగ్యవంతమైన సంఘం యొక్క మరొక లక్షణం కచ్చితంగా సంఘ సభ్యత్వం అంటే ఏమిటో దేవుని వాక్యానుసారంగా గ్రహించడమే.

### పర్యాలోకనకు (ఆలోచించడానికి) ప్రశ్నలు

**1.** స్థానిక సంఘంలో సభ్యత్వ జాబితాలను గూర్చి బైబిల్‌లో ఉందా? **1** కొరింథి **12:14-26** చదవండి. క్రీస్తు శరీరంగా తగిన విధంగా జీవించడానికి సంఘ సభ్యత్వం ఏ విధంగా తోడ్పడుతుంది?

**2.** సంఘ సభ్యత్వం అంటే ఏదో అప్పుడప్పుడు లేక అవసరమైన సందర్భాలకే పరిమితమని ఆలోచించక సువార్త నిమిత్తం ఒకరికొకరం బద్ధులమై ఉండే క్రమం తప్పని ఆచరణగా భావించాలని రచయిత సూచిస్తున్నాడు. మీ సంఘంలో ఎక్కువ మంది తమ సభ్యత్వాన్ని ఏ విధంగా దృష్టిస్తున్నారు? ఒక సంఘ సభ్యుని బాధ్యత లేమిటి? ఆ బాధ్యతలను సరిగ్గా నిర్వహించడం సువార్త పరిచర్యకు ఏ విధంగా దోహదపడుతుంది.

3. క్రీస్తు పట్ల సజీవమైన నిబద్ధత కలిగి ఉండడానికి సంఘ సభ్యత్వం నిదర్శనంగా ఉండాలని రచయిత సూచిస్తున్నాడు లేకపోతే అది అర్థరహితమైంది ప్రమాదకరం కూడా కావచ్చు. అది ఎందువల్ల సత్యం? క్రీస్తుపట్ల, ఆయన సంఘం పట్ల ఒక సజీవమైన ఒడంబడికలో ఉండడమంటే ఏమిటి?

4. ఒక వ్యక్తిరక్షణకు అతని సంఘ సభ్యత్వం సాక్షంగా ఉంటుందని రచయిత అంటున్నాడు. హెబ్రీ 13:17 చదవండి. తమ కాపుదలలో ఉన్న వారిని గూర్చి సంఘ నాయకులు లెక్క అప్పచెప్పాలని దేవుని వాక్యం బోధిస్తుంది. ఈ "లెక్క" అంటే –ఆ వ్యక్తి క్రీస్తు నంగీకరిస్తున్నట్టు నిర్ణయం తీసుకున్నాడని చెప్పడమా లేక అతడు నమ్మకంగా ఫలిస్తున్నదానికి సాక్ష్యంగా ఉండడమా? మన సంఘ సభ్యుల జాబితాలో ఎవరిపేర్లు ఉండాలో ఇదెలా ప్రభావితం చేస్తుంది?

5. మన సంఘ సభ్యత్వ జాబితాను జాగ్రత్తగా సవరించడం వల్ల చాలా ఉపయోగాలున్నట్టు రచయిత సూచిస్తున్నాడు. వాక్యానుసారమైన సంఘ సభ్యత్వం గూర్చిన అవగాహన క్రైస్తవేతరుల ముందు మన సాక్ష్యాన్ని ఏ విధంగా స్పష్టం చేస్తుంది? దానివల్ల బలమీనంగా ఉన్న క్రైస్తవులు దారి తప్పకుండా ఎలా ఉంటారు? పరిణితి చెందిన క్రైస్తవుల దృష్టిశిష్యరికం మీద కేంద్రీకరించబడేలా అది ఎలా ప్రభావితం చేస్తుంది?

# 7. దేవుని వాక్యాన్ని అనుసరించి సంఘ క్రమ శిక్షణను అర్థం చేసుకోవడం

1. దేవుడు పరిశుద్ధతను కోరుకొంటాడు.
2. తీర్పు
3. సంఘం తీర్పు తీర్చాలని దేవుడు కోరుకొంటాడు.
4. ముందు ద్వారం మూసి వెనక ద్వారం తెరువు
5. క్రొత్త సభ్యులను చేర్చుకోవడం
6. క్రమశిక్షణను బాధ్యతగా చేయడం
7. సరిదిద్దే క్రమశిక్షణకు ఐదు కారణాలు

ఆరోగ్యవంతమైన సంఘం యొక్క ఏడవ లక్షణం సంఘ క్రమ శిక్షణను పాటించడం. వాక్యానుసారమైన సంఘ క్రమ శిక్షణను పాటించడం వల్ల సంఘ సభ్యత్వానికి అర్థం వస్తుంది. ప్రారంభంలో సంఘాలు దీనిని పాటించినా క్రమంగా అది కనుమరుగైపోయింది.

మానవులమైన మనం దేవుని పోలికను ధరించి దేవుని వ్యక్తిత్వ లక్షణాలకు సాక్షులముగా ఆయన సృష్టి ముందు నిలబడడానికి చేయబడ్డాం (ఆదికాండం 1:27) కాబట్టి పాతనిబంధన అంతటిలో దేవుడు తన కొరకు ఒక జనాంగాన్ని ఏర్పరచుకొన్నప్పుడు వారు పరిశుద్ధులుగా ఉండాలనీ, వారి వ్యక్తిత్వం తన వ్యక్తిత్వాన్ని పోలి ఉండాలని చెప్పడం ఆశ్చర్యకరమేమీ కాదు (లేవీయ కాండం 19:2, సామెతలు 24:1, 25) పాతనిబంధనలో మనకు కనిపించే విధంగా కొందరిని సరిదిద్దడానికి లేదా కొందరిని సమాజం నుండి తొలగించడానికి ఇదే ఆధారం (సంఖ్యాకాండం 15:30-31) క్రొత్త నిబంధన సంఘాన్ని రూపుదిద్దడానికి కూడా అదే ఆధారం (2 కొరింథి 6:14-7, 13:2, 1 తిమోతి 6:3-5, 2 తిమోతి 3:1-5) చూడండి.

అయినా ఈ భావన ఈనాటి ప్రజలకు వ్యతిరేకమైనదిగా లేదా అసంబద్ధమైనదిగా తోచవచ్చు. మన ప్రభువైన యేసు తీర్పు తీర్చ వద్దని మత్తయి 7:1 లో చెప్పలేదా? అవును నిజమే ఆయన తీర్పు తీర్చవద్దని చెప్పడానికి అక్కడ ఒక కారణముంది. అయితే ఒక వ్యక్తి పాపంలో ఉన్నప్పుడు అతన్ని బహిరంగంగా గద్దించమని కూడా ఆయన చెప్పాడు (మత్తయి 18:15-17, లూకా 17:3) కాబట్టి తీర్పు తీర్చవద్దు అంటే దానిలో ఇమిడి ఉన్న అంశాలన్నీ వద్దని అనడం కారు.

దేవుడే న్యాయాధిపతి. మనం పాపంలో ఉన్నంతసేపు ఆయన న్యాయమైన తీర్పు కింద ఉంటాం. పాత నిబంధనలో దేవుడు వ్యక్తులకూ మరియు దేశాలకూ తీర్పుతీర్చాడు. క్రొత్త నిబంధనలో మన పనులకు తీర్పు తీర్చబడుతుందని హెచ్చరించబడ్డాం (1 కొరింథి 3 చూడండి) దేవుడు ప్రేమతో తన బిడ్డలను సరిదిద్ది క్రమశిక్షణలోకి తెస్తాడు మరియు భక్తి హీనులను ఆగ్రహంతో దండిస్తాడు. (హెబ్రీ 12 చూడండి) అయితే అంత్యదినాన దేవుడే అత్యున్నత న్యాయాధిపతిగా తన్నుతాను ప్రత్యక్షపర్చుకొంటాడు. (ప్రకటన 20 చూడండి) ఈ తీర్పు అంతటిలో దేవుడెప్పుడూ తప్పుకాదు ఆయనెప్పుడూ నీతిమంతుడు, సరిగ్గా తీర్పుతీరుస్తాడు. (యెహోషువా 7, మత్తయి 23, లూకా 2, అపొస్తలుల కార్యములు 5, రోమా 9 చూడండి) ఇతరులు కూడా అలా తీర్పుతీర్చాలనేది దేవుని ఉద్దేశమని చెప్తే ఈనాడు చాలామందికి ఆశ్చర్యం కలగవచ్చు. రాజ్యానికి తీర్పు తీర్చే బాధ్యత ఇవ్వబడింది (రామా 13 చూడండి) మనకు మనం తీర్పు తీర్చుకోవాలని చెప్పబడింది (1 కొరింథి 11:28, హెబ్రీ 4, 2 పేతురు 1:5) సంఘంలో మనం ఒకరికొకరం తీర్పు తీర్చుకోవాలని (అంటే తుదకు దేవుడు తీర్పు తీర్చినట్టు కాదు) మత్తయి 7:1లో యేసు చెప్పిన మాటలలోను 1 కొరింథి 5-6లో పౌలు వ్రాసిన విషయాలలోనూ మరెన్నో ఇతర వాక్యభాగాలలోను సంఘం తనకు తాను పరీక్షించుకొని అంతర్గత తీర్పును అమలు చేయాలని చెప్పబడింది. అయితే అది ప్రతీకారం తీర్చుకోవడానికి కాదు కాని తనను తాను సరిదిద్దుకోవడానికి, సభ్యులను క్రమ శిక్షణ లోకి తేవడానికి మాత్రమే (రోమా 12:19) కొరింథిలోని పాపపు నడత కలిగిన వ్యక్తిని, ఎఫెసులోని అబద్ధ బోధకులను సంఘం నుండి బహిష్కరించాలని పౌలు చెప్పాడు వారిని సాతానుకు అప్పగించాలన్నారు.

(1 కొరింథి 5, 1 తిమోతి 1)

ఒక సంఘం అభివృద్ధి చెందడానికి అవసరమైన పుస్తకాలు వ్రాసే ఒక రచయిత తన సలహాలను ఇలా క్రోడీకరించాడు "ముందు ద్వారం తెరువు, వెనుక ద్వారం మూసివేయి". అతని భావమేమిటంటే ప్రజలు రావడానికి సంఘాన్ని అందుబాటులో ఉంచి, వారి ఆత్మీయ ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి అని. ఇవి రెండూ మంచి లక్ష్యాలే. చాలా మంది సంఘ కాపరులు దానిని పాటిస్తున్నారు. అయితే వాక్యనుసారమైన మాదిరిని అనుసరిస్తే మనం ముందు ద్వారం మూసి వెనుక ద్వారం తెరువు అని అంటాం అంటే సంఘంలో ప్రవేశించడం కష్టతరం చేసి సంఘం నుండి తొలగించడం సులభతరం చేయాలి. అటువంటి చర్యలు సంఘం ఈ లోకంలో ఉండి కూడ తన ప్రతేకతను కాపాడు కోవడానికి సహాయం చేస్తాయి.

ఈ క్రమ శిక్షణ మనం సంఘంలోకి క్రొత్త సభ్యులను తీసుకోవడంలో మొదట కనిపించాలి. ఆ క్రొత్త వ్యక్తులు క్రీస్తును ఘనపరిచే జీవితం జీవిస్తున్నారా అని మనం అడుగుతున్నామా? వారు మనతోనూ మనం వారితోనూ చేసే ఒడంబడిక ఎంత తీవ్రమైనదో మనం గమనిస్తున్నామా? ఒక వేళ క్రొత్త సభ్యులను చేర్చుకొనేటప్పుడే మనం జాగ్రత్తగా ఉంటే ఆ తర్వాత క్రమశిక్షణ చర్యలు చేపట్టే అవకాశం రాదు.

అయితే ఎటువంటి సంఘ క్రమ శిక్షణ అయినా ప్రతికూలంగా లేదా చెడుగా చేసే అవకాశం కూడా ఉంది. మనం ఇతరుల మీద నిందమోపి వారికి తీర్పు తీర్చవద్దని క్రొత్త నిబంధనలో ఉంది (మత్తయి7:1) అలాగే అనవసరమైన విషయంలో ఒకరికొకరం తీర్పుతీర్చుకోవద్దని కూడా ఉంది. (రోమా14-15) కాపరత్వంలో వీటిని ఆచరించడం చాలా కష్టం, అయితే క్రైస్తవ జీవితమే కష్టతరమైంది. విమర్శలకు గురి అయ్యేది. మన సమస్యలు లేదా కష్టాలు మనం క్రమశిక్షణను పాటించకుండా ఉండడానికి సాకులు కాకూడాదు. సంఘంలోని నాయకుల మరియు సభ్యుల జీవితాలను మరియు బోధనలను ప్రతి సంఘం పరీక్షించి సంఘసాక్ష్యంలో రాజీపడకుండా చూసుకోవాలి (అపొకా17-1కొరింథి5, 1తిమోతి3, యాకోబు 3:1.2 పేతురు 3, 2యోహాను.

వాక్యానుసారమైన సంఘ క్రమశిక్షణ అంటే దేవునికి విధేయతను చూపడం మరియు మనకు సహాయం అవసరమని ఒప్పుకోవడం. సంఘక్రమశిక్షణ యొక్క ఉద్దేశ్యం మేలు కరమైంది. దానికి 5 కారణాలు ఉన్నాయి. 1) వ్యకుల క్రమశిక్షణ కొరకు, 2) పాపం యొక్క తీవ్రతను మరియు ప్రమాదాన్ని ఇతర క్రైస్తవులు గ్రహించునట్లు 3) సంఘం యొక్క సంపూర్ణ ఆరోగ్యం కొరకు 4) సంఘం యొక్క సాక్ష్యం కొరకు 5) మన పరిశుద్ధత దేవుని పరిశుద్ధతను ప్రతిఫలించడానికి. ఏదైనా ఒక సంఘం యొక్క సభ్యులం కావడం మన అతిశయం కొరకు కాదు కాని దేవుని నామం కొరకు. వాక్యానుసారమైన సంఘ క్రమశిక్షణ ఆరోగ్యవంతమైన సంఘం యొక్క మరొక లక్షణం.

## ఆలోచించడానికి ప్రశ్నలు

1. యోహాను 5:27-30 చదవండి. తీర్పు తీర్చే అధికారం తండ్రి ఎవరికిచ్చాడు? ఇప్పుడు మత్తయి :15-17 చదవండి ఈ లోకంలో తీర్పు తీర్చే అధికారం దేవుడు ఎవరికి బదలాయించాడు? మన ప్రభువు అప్పగించిన ఈ బాధ్యతను సంఘం నమ్మకంగా చేపట్టిందా?
2. 1 కొరింథి 5:1-2 చదవండి. కొరింథి సంఘంలో పాప బంధకాలలో ఉన్న సంఘ సభ్యుని పై ఏ రకమైన చర్య తీసుకోవాలని పౌలు చెప్పాడు? ఇప్పుడు 3-5 వచనాలు చదవండి. సంఘం ఏ అధికారంతో ఆ పని చేయాలి? అటువంటి చర్య యొక్క తుది ఫలితం ఏ విధంగా ఉంటుంది. పౌలు సూచించిన ఆ క్రమశిక్షణ చర్య హృదయం లేని కఠినమైన చర్య అనుకొంటున్నారా లేక ఒక వ్యక్తి ఆత్మకు ఉపయోగపడగల ప్రేమ పూర్వక చర్య అనుకొంటున్నారా?
3. క్రైస్తవులు సంఘం యొక్క “ముందు ద్వారాన్ని తెరిచి, వెనక ద్వారాన్ని మూయాలి” అని ఒక రజయిత అన్నాడు. ఆ మాటల అర్ధమేమిటి? ఈ పుస్తక రచయిత మాత్రం “ముందు ద్వారాన్ని మూసి వెనుక ద్వారాన్ని తెరవండి” అన్నాడు. ఈ రెండింటిలో ఏది వాక్యానుసారమైంది? ఏది ఆరోగ్యవంతమైన సంఘ సభ్యత్వాన్ని ప్రోత్సహిస్తుంది?
4. రోమా 14:1-4 చదవండి. సంఘ క్రమ శిక్షణ విమర్శలకు లోనయ్యే విషయాలు ఏవి? మన ప్రభువు మత్తయి 18:15-17లో మనకు అప్పగించిన బాధ్యతను మీ సంఘం విమర్శల నెదుర్కొంటూ కూడా ఏ విధంగా నమ్మకంగా జాగ్రత్తగా నిర్వర్తించగలదో కొంత సేపు ప్రశాంతంగా ఆలోచించండి.

# 8. క్రైస్తవ శిష్యరికం మరియు అభివృద్ధిని ప్రోత్సహించడం

1. క్రైస్తవ అభివృద్ధి
2. పరిశుద్ధత అభివృద్ధికి నిదర్శనం
3. క్రమశిక్షణను నిర్లక్ష్యం చేస్తే అభివృద్ధి నిరోధించబడుతుంది.
4. కలిసి అభివృద్ధి చెందే సమాజం
5. అభివృద్ధికి నిదర్శనాలు
6. దేవుడు అభివృద్ధిలో మహిమ పర్చబడతాడు.

ఆరోగ్యవంతమైన సంఘం యొక్క మరొక ప్రత్యేక లక్షణం సంఘ అభివృద్ధి ! కేవలం సంఖ్యలో కాదు నిజమైన సభ్యత్వంలో. ఒక వ్యక్తి జీవితమంతా "బాల క్రైస్తవునిగా" ఉండవచ్చు అని కొంతమంది భావిస్తారు. ఎంతో భక్తిగల క్రైస్తవులకు కూడా అభివృద్ధి అనేది అవసరమైతే ఎంపిక చేసుకోగలిగిన అంశంగానే ఉంది. కాని అభివృద్ధి అనేది జీవలక్షణం. పెరుగుతున్న వృక్షాలే ప్రాణమున్న వృక్షాలు. పెరుగుతన్న జంతువులే ప్రాణమున్న జంతువులు పెరుగుదల మరియు ముందడుగు అనేవి అభివృద్ధిలో భాగాలు. చాలా సందర్భాలలో దేని అభివృద్ధి అయినా ఆగిపోయిందంటే అది చనిపోవడం మనకు అనుభవమే.

కొరింథి సంఘస్థులు తమ క్రైస్తవ విశ్వాసంలో అభివృద్ధి చెందాలని పౌలు ఆశించాడు. (2 కొరింథి 10:) క్రైస్తవ శిష్యరికం అంటే కేవలం ఉద్వేగంగా స్పందించడం మతపరమైన భాషనుపయోగించడం లేక దేవుని వాక్యంలో పాండిత్యం సంపాదించడం మాత్రమే కాదని జోనాతాన్ ఎడ్వర్డ్ అనే రచయిత అన్నాడు. సంతోషం, ప్రేమ సంఘం పట్ల ఆసక్తి పెరగడం కూడా కాదు. చివరికి దేవుని పరిచర్యలో అమితాసక్తి, గాఢమైన ఇష్టం ఉండి ఆయనను అమితంగా స్తుతించడం కూడా నిజమైన క్రైస్తవ అభివృద్ధికి నిదర్శనాలు కావని అతని ఉద్దేశం. మరి ఏది దానికి గుర్తు? ఎడ్వర్డ్ గారిననుసరించి ఇవన్నీ క్రైస్తవ పరిణితికి గుర్తులే అయినా కచ్చితమైన నిదర్శనం మాత్రం దినదినం పరిశుద్ధతలో వృద్ధి చెందడమే. తన్ను తాను ఉపేక్షించుకోవడంతో అది మొదలవుతుంది. ఒక సంఘం తన సభ్యులలో అటువంటి పరిశుద్ధత పెంపొందించడానికి పాటు పడాలి.

మనం ఏడవ అధ్యాయంలో చూసినట్టుగా సంఘం క్రమశిక్షణను నిర్లక్ష్యం చేసినప్పుడు ఏర్పడే పరిణామాలలో ఒకటి– సంఘంలో శిష్యుల సంఖ్య పెరుగుదల కష్టం కావడం. క్రమ శిక్షణ లేని సంఘంలో ఉదాహరణలు స్పష్టంగా ఉండవు మాదిరిని గుర్తించడం క్లిష్టంగా మారుతుంది. అంటే సభ్యులకు ఎవరి మాదిరిని అనుసరించాలో, ఎవరిని ఉదాహరణగా తీసుకోవాలో అర్థంకాదు. ఏ తోటమాలి కూడా కలుపు మొక్కలను నాటాలని అనుకోడు. కలుపు మొక్కలను ఎవరూ కోరుకోరు. అవి వాటి చుట్టూ ఉన్న చెట్లమీద చెడు ప్రభావాన్ని చూపిస్తాయి. అటువంటి కలుపు మొక్కలను మనం సంఘంలో నిర్లక్ష్యం చేయడం దేవుని ఉద్దేశం కాదు.

విశ్వాసుల యొక్క నిబంధన సమాజంలో మంచి మాదిరులు తన ప్రజల ఎదుగుదలకు లేదా అభివృద్ధికి దేవుడు వాడుకొనే సాధనాలు. దేవుని ప్రజలు కలిసి ఎదుగుతూ పరిశుద్ధతలో, నిస్వార్థమైన ప్రేమతో ఎదుగుతున్నప్పుడు తమ సంఘంలో క్రమశిక్షణను అమలు చేసి శిష్యత్వాన్ని ప్రోత్సహించే సామర్థ్యాన్ని కూడా పెంపొందించుకోవాలి. దేవుని ప్రజలు కృపలో ఎదగడానికి దేవుని సంఘం ఒక సాధనం కావాలి. అలా కాకుండా ఎక్కడైతే పాస్టర్ యొక్క ఉద్దేశాలే బోధించబడతాయో దేవున్ని ఆరాధించడం కన్నా ప్రశ్నించడమే ఎక్కువవుతుందో, ఎక్కడ సువార్త విలీనమవుతుందో పలుచబడుతుందో మరియు సౌవార్తీకరణ వెర్రితలలు వేస్తుందో ఎక్కడ సంఘ సభ్యత్వం అర్థ రహితంగా ఉంటుందో పాస్టర్ చుట్టూ ఈ లోకంసబంధమైన వాతావరణం నెలకొంటుందో అక్కడ మనం ఎటువంటి అభివృద్ధి ఆశించలేం. అటువంటి సంఘం కచ్చితంగా దేవున్ని మహిమ పర్చలేదు.

అభివృద్ధి చెందే సంఘాల వల్ల దేవుడు మహిమపర్చబడతాడు. ఆ అభివృద్ధి ఎన్నో విధాలుగా కనబడుతుంది. ఎదుగుతున్న సభ్యులు సంపూర్ణ కాలసేవకు పిలువబడడం, వయసు మళ్ళుతున్న వారు సౌవార్తీకరణ గూర్చి తాజాగా ఆలోచించడం, పెద్దవారు మరణించినప్పుడు ఏ బంధుత్వం లేకపోయినా కేవలం ప్రేమను బట్టి చిన్న వారంతా భూస్థాపన కార్యక్రమాలకు వెళ్ళడం, ప్రార్థనా పరిచర్య బాగా పెరగడం, బోధించాలన్న కోరిక ఎక్కువ కావడం, దాతృత్వం పెరగడం, ఎప్పుడూ ఇచ్చేవారు మరింత త్యాగపూరితంగా ఇవ్వడం, ఎక్కువ మంది సంఘ సభ్యులు ఇతరులతో సువార్త పంచుకోవడం, తల్లిదండ్రులు తమ పిల్లలను విశ్వాసములో పెంచవలసిన బాధ్యతను గుర్తించడం మొదలైనవి. క్రైస్తవులు ఇటువంటి అభివృద్ధికొరకు ప్రార్థించాలి మరియు పనిచేయాలి.

ఒక సంఘంలో క్రీస్తు పోలికలోకి మారుతున్న సభ్యులను మనం చూసినప్పుడు ఎవరికి ఆ ఘనత దక్కుతుంది? ఎవరికి మహిమ కలుగుతుంది? “వృద్ధి కలుగజేయు దేవునిలోనే గాని నాటువాని లోనైనను నీళ్ళుపోయు వానిలోనైనను ఏమియు లేదు” (1 కొరింథి 3:6-7) పేతురు తన పత్రిక ముగించేటప్పుడు ఇలా దీవించాడు. మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు అనుగ్రహించు కృపయందును, జ్ఞానమందును అభివృద్ధి పొందుడి (2 పేతురు 3:18) మన అభివృద్ధి మనకు ఘనత తెస్తుందని మనం అనుకోవచ్చు కాని పేతురుకు నిజం తెలుసు. “అన్యజనులు మిమ్మును ఏ విషయములో దుర్మార్గులని దూషించుదురో ఆ విషయములో వారు మీ సత్క్రియలను చూసి వాటిని బట్టి దర్శన దినమున దేవుని మహిమ పర్చునట్లు వారి మధ్యను మంచి ప్రవర్తనగల వారైయుండవలెనని వేడుకొనుచున్నాను. (1 పేతురు 2:12) మీ వెలుగును మనుష్యుల యెదుట ప్రకాశింపనియ్యుడి అని యేసు పలికిన మాటలు అతినికి గుర్తున్నాయి (మత్తయి 5:16) క్రైస్తవ శిష్యరికం మరియు అభివృద్ధి ఆరోగ్యవంతమైన సంఘం యొక్క మరియొక గుర్తు.

**ఆలోచించడానికి ప్రశ్నలు**

1. 1 పేతు 2:1-3 చదవండి. ఈ క్రైస్తవుల పట్ల పేతురుకున్న నిరీక్షణ ఏమిటి? "రక్షణ విషయంలో ఎదగడం" అనడంలో అతని భావమేమి?

2. సంఘాభివృద్ధి అంటే కేవలం సంఘ సభ్యుల సంఖ్య పెరగడమేనని కొందరనుకొంటారు. అ॥కా 2:41 చదవండి అక్కడ రక్షించబడిన వారి సంఖ్య ఎందుకు వ్రాయబడిందని మీరనుకొంటున్నారు? ఇప్పుడు 2వ అధ్యాయం మొత్తం చదవండి. రక్షించబడిన వారు పరిశుద్ధతలో ఎదగకపోతే ఆ సంఖ్య వలన దేవునికి మహిమ కలుగుతుందా? అవును అయితే ఎందుకు? కాదు అయితే ఎందుకు?

3. కలుపు మొక్కలు తమ చుట్టు ఉన్న మొక్కల పై చెడు ప్రభావం చూపిస్తాయి అని రచయిత అంటున్నాడు పాప జీవితంలో ఉండి క్రమ శిక్షణ లేకుండా ఉన్న సంఘ సభ్యులు తమ చుట్టూ ఉన్నవారిమీద ఎటువంటి చెడు ప్రభావం కలిగిస్తారు?

4. ఆత్మీయంగా పరిణితి చెందుతున్న సంఘాన్ని బట్టి దేవుడు మహిమ పొందే కొన్ని విధానాలు చెప్పండి వీటిలో ఎన్ని మీ సంఘంలో కనిపిస్తాయి?

# 9. వాక్యానుసారమైన సంఘ నాయకత్వం

1. సంఘ పెద్ద యొక్క వాక్యానుసార బాధ్యతలు
2. పెద్దల యొక్క క్లుప్త చరిత్ర
3. సంఘానిదే తుది అధికారం
4. పెద్దలందరూ “బోధించే పెద్దలు ”
5. పెద్దల బహువచనం
6. సంఘ కాపరి యొక్క ప్రత్యేక పాత్ర
7. పెద్దలకు అనేక బాధ్యతలుండడం వల్ల ఉపయోగాలు.
8. పెద్దలకు మరియు పరిచారకులకు మధ్య బేధం

ఆరోగ్యవంతమైన సంఘంలో ఎటువంటి నాయకత్వం ఉంటుంది? క్రీస్తుకు అంకితమై ఇతరులకు సేవచేసే వరం కలిగి ఉంటుందా? అవును. సంఘ కార్యకలాపాలలో మాదిరిగా ఉండేలా సేవచేసే పరిచారకులుంటారా? అవును. దేవుని వాక్యం నమ్మకంగా బోధించే కాపరి ఉంటారా? అవును. అయితే దేవుని వాక్యం చెప్పేదేమిటంటే వీరందరూ కాకుండా లేక ఇవిమాత్రమే కాకుండా ఆరోగ్యవంతమైన సంఘంలో మరేమో ఉంటుంది అదే పెద్దల పాత్ర.

ఒక కాపరిగా మా సంఘంలో తమ ఆత్మీయ వరాలు మరియు కాపరత్వపు ఛాయలను బట్టి సంఘంలో పెద్దలుగా లేక పై విచారణ కర్తలుగా ఉండడానికి పిలువ బడ్డారని సూచించే లక్షణాలు గల వారిని క్రీస్తు ఉంచాలని ప్రార్థిస్తాను. (అ॥కా 20) ఎవరైనా ఒక వ్యక్తికి దేవుడు అటువంటి లక్షణాలు ఇచ్చాడని స్పష్టమైతే, ఒకవేళ ప్రార్థన తర్వాత అతని వరాలు స్పష్టంగా కనిపిస్తే అతనిని పెద్దగా నిర్ణయించి ప్రత్యేకించాలి.

ప్రతి సంఘంలోనూ పెద్దల పాత్రను నిర్వర్తించే వ్యక్తులుంటారు వారిని ఏ పేరుతోనైనా పిలవవచ్చు. క్రొత్త నిబంధనలో అటువంటి వ్యక్తుల కొరకు రెండు పదాలు వాడబడ్డాయి. “పెద్ద” మరియు “పై విచారణ కర్త”. సంఘ చరిత్రలో ప్రారంభ దినాలలో అంటే, 16వ శతాబ్దకాలంలో ‘పెద్ద’ అనే బాధ్యత క్రొత్త నిబంధన సంఘంలో ఉండేదని చెప్పారు. అమెరికా దేశంలో 18 మరియు 19 శతాబ్దాలలో ప్రతి సంఘంలో పెద్దలుండేవారు. 20వ శతాబ్దపు ప్రారంభంలో కూడ సంఘంలో ‘పెద్దలు’ అనబడే వారుండేవారని గ్రంథాలలో తెలుస్తుంది.

బాప్టిస్టు వారు సంఘానికి ప్రాధాన్యతనిచ్చేవారు. ఏ విషయంలోనైనా తుది అధికారం పెద్దలకు కాదుగాని సంఘమంతటికీ ఉంటుందని వారు నమ్ముతారు. కాబట్టి బాప్టిస్టు సంఘంలో పెద్దలు, కమిటీలు, బోర్డులు ఏవైనా ఎవరైనా సంఘానికి సలహాదారులుగా మాత్రమే వ్యవహరిస్తారు.

పౌలు వ్రాసిన ఉత్తరాలలోనూ సంఘానిదే తుది బాధ్యత అనే విషయం బోధపడుతుంది. 1 కొరింథి 5లో పాపాన్ని సహించినందుకు పాస్టరును గాని పెద్దలను గాని పౌలు నిందించలేదు కాని సంఘమంతటినీ బాధ్యులుగా ఎంచాడు. 2 కొరింథి 2లో పాపం చేస్తున్న ఒక వ్యక్తి విషయంలో అతన్ని సరిదిద్దడానికి వారిలో అనేకులు ఏం చేశారో పౌలు వ్రాశాడు. గలతీయులకు వ్రాసిన పత్రికలో "సంఘమంతా ఎటువంటి వాక్యం వింటున్నారో పరీక్షించుకొమ్మన్నాడు. 2 తిమోతి 4లో పౌలు అబద్ధ బోధకులను మాత్రమే గద్దించలేదు కాని తమ దురద చెవులను తృప్తి పర్చుకోవడానికి వారికి డబ్బిచ్చి నియమించిన వారిని కూడా గద్దించాడు. పెద్దలు నాయకత్వం వహిస్తారు అయితే వాక్యానుసారంగా చేస్తారు. అయితే సంఘం విధించిన పరిమితులకు కట్టుబడి మాత్రమే చేస్తారు. క్రొత్త నిబంధనలోపెద్ద, విచారణ కర్త, కాపరి అనే పదాలను పర్యాయ పదాలుగా ఒకదాని స్థానంలో మరొక దానిని ఉపయోగించడం బాప్టిస్టు వారు ప్రామాణికంగా తీసుకొంటారు. 1 తిమోతి 3:2లో పెద్దలు బోధించేవారై ఉండాలని పౌలు తిమోతికి స్పష్టంగా చెప్పాడు. తీతుకు వ్రాసిన ఉత్తరంలో "నమ్మదగిన బోధను గట్టిగా పట్టుకొనే వాడై ఉండాలని వ్రాశాడు (తీతు 1:9) అందువల్ల వాక్యాన్ని బోధించలేని వారు సంఘంలో పెద్దలుగా ఉండడం ఆమోదయోగ్యం కాదని బాప్టిస్టువారు భావిస్తారు.

ఒక సంఘంలో ఎంతమంది పెద్దలుండాలో కచ్చితంగా నిర్దేశించబడక పోయినా క్రొత్త నిబంధనలో బహువచనమే ఉపయోగించబడింది (అ॥కా 14:23, 16:4,20:178, 21:18, తీతు 1:5, యాకోబు 5:14) నా అనుభవంలో సంఘంలో ఒకే కాపరి ఉండడానికి బదులుగా ఆయనతో పాటు అనేక మంది పెద్దలుండడం మంచిదని తెలుసుకొన్నాను. క్రొత్త నిబంధన కాలంలోని సంఘాలకు పెద్దలవసరమయ్యారు ఇప్పుడు కూడా వారు అవసరమే.

అంటే పాస్టరుకు ప్రత్యేక పాత్ర ఏమీ లేదని అర్థం కాదు. క్రొత్త నిబంధనలో బోధించడం గూర్చి అనేక వాక్యభాగాలున్నాయి. అవి పెద్దలకు వర్తించవు. కొరింథిలో పౌలు పూర్తిగా వాక్యం బోధించడానికే పరిమితమయ్యాడు. ఆ విధంగా సంఘ పెద్దలు చేయలేకపోయారు (అ॥కా 18:5, 1 కొరింథి 9:14, 1 తిమోతి 4:13, 5:17) బోధకులు కేవలం బోధించడానికే ఆయా ప్రాంతాలకు వెళ్ళారు (రోమా 10:14-15) కాని పెద్దలు సంఘంలో ఒక భాగంగా ఉన్నారు (తీతు 1:5)

అయితే మనం ఒక విషయం జ్ఞాపక ముంచుకోవాలి బోధకుడు లేదా సంఘ కాపరి తన సంఘంలోని పెద్దలలో ఒకడు. అంటే సంఘపరంగా చేయవల్సిన నిర్ణయాలలో సంఘ సభ్యులందరూ ఉండాల్సిన అవసరంలేని విషయాలేవైనా ఉంటే అవి పెద్దల నిర్ణయానికే వదిలి వేయబడతాయి. దీనివల్ల చాలా ఉపయోగాలున్నాయి. కాపరి తలాంతులు మెరుగుపడి, లోపాలు మరుగుపడి అతని తీర్పుకు బలం చేకూరి, సంఘంలో నిర్ణయాలు చేయడం సులభమౌతుంది. పెద్దలు అనవసరమైన విమర్శలకు లోను కారు. సంఘం తన ఆత్మీయ స్థితి విషయంలో బాధ్యతాయుతంగా ఉండి తన సిబ్బందిపై తక్కువగా ఆధారపడేలా చేస్తుంది.

చాలా సంఘాలలో పెద్దలు అంటే సంఘ పరిచారకులనో లేక సిబ్బంది అనో భ్రమపడతారు. పరిచారకులకు కూడా క్రొత్త నిబంధన సంఘంలో బాధ్యతలున్నాయి (అ॥కా॥6) రెండింటినీ లేక ఇద్దరి బాధ్యతలను కచ్చితంగా వేరుచేయడం కష్టమే అయినా పరిచారకులు సంఘకార్యక్రమాలలో పనిచేస్తారు. సంఘ నిర్వహణలో, పరిపాలనా విషయాలలో పాల్గొంటారు. సంఘ సభ్యుల అవసరతలను తీర్చడానికి పనిచేస్తారు. ఈనాడు చాలా సంఘాలలో పరిచారకులు ఆత్మీయ పాత్రను కూడా పోషిస్తున్నారు అయితే చాలా విషయాలు పాస్టరుకు వదిలేయబడతాయి.

ఒక పాస్టరుగా నేను సంఘ పెద్ద పాత్రలో ఉన్నాను. నేను ప్రధాన బోధనా పెద్దను. అయితే పెద్దలందరు సంఘం యొక్క నిర్మాణానికి జ్ఞాన వృద్ధికి కలిసి పనిచేయాలి. దాని కొరకు క్రమంగా కలుసుకోవాలి, ప్రార్థించాలి. ఆచారణాత్మక విలువ కలిగిన వాక్యానుసార ఆలోచన ఇది. ఒక వేళ సంఘాలలో ఆచరణలో పెడితే కాపరుల భుజాల మీది భారం తొలగించ బడి మరింత సమర్థవంతంగా పనిచేయగలగుతారు. భక్తిగల, మంచి చెడులను గుర్తించగల వివేకం కలిగిన, నమ్మకమైన వ్యక్తులను గుర్తించి వారిని సంఘంలో పెద్దలుగా నియమించు కోవడం ఆరోగ్యవంతమైన సంఘం యొక్క లక్షణం.

**ఆలోచించడానికి ప్రశ్నలు**

1. మత్తయి 18:15-17 చదవండి. ఒక సోదరుని వ్యాజ్యం తీర్చడానికి తుది అధికారం ఎవరికుందని యేసు గుర్తించాడు? ఇప్పుడు అ॥కా 6:1-4 చదవండి. సంఘానికి ఏడుగురు పరిచారకులను ఎన్నుకొనే పని అపొస్తలులు ఎవరికప్పగించారు? 2 కొరింథి 2-6 కూడ చదవండి. ఈ వ్యక్తికి శిక్ష ఎవరు విధించారు? సంఘ విషయాలలో తుది అధికారం ఎవరిదని ఈ వాక్య భాగం చెప్తుంది?
2. తీతు 1:5 చదవండి సంఘంలో తుది అధికారం సంఘ సభ్యులందరిదని గ్రహించినా, ప్రతి సంఘంలో పెద్దలుండడం అవసరమని పౌలు ఎందుకు భావించాడు?
3. 1 తిమోతి 3:1-6లో పెద్దకుండవల్సిన లక్షణాల జాబితాను పౌలు పేర్కొన్నాడు. సంఘ పెద్దకు ఆ లక్షణాలుండాల్సిన అవసర మేమిటో వాటి ప్రాముఖ్యత ఏమిటో ఆలోచించండి.
4. అ॥కా 6:1-4 చదవండి సంఘ పరిచారకుని పాత్రకు సంఘ కార్యకలాపాలను పర్యవేక్షించే పై విచారణకర్త పాత్రకు భేదమేమి? మీ సంఘం ఆ విషయాన్ని గుర్తించిందా?
5. అపొస్తలుం కార్యములు 6వ అధ్యాయంలో సంఘ పరిచారకులు భౌతిక అవసరాల కొరకు పనిచేస్తారని తద్వారా పై విచారణ కర్తలు (అపొస్తలులు, పెద్దలు, పాస్టర్‌లు ) ప్రార్థనలో వాక్య పరిచర్యలో కొనసాగడానికి అవకాశం కల్పిస్తారని అర్ధమౌతుంది. మీ సంఘంలో పరిచారకులు చూసుకోగలిగిన భౌతిక అవసరాలు ఏమిటి? సంఘ ఐక్యతను కాపాడడానికి మరియు వాక్యపరిచర్యను బలపర్చడానికి పరిచారకులు ఇంకా ఏ బాధ్యతలు నిర్వహించగలరు?

ఆరోగ్యవంతమైన సంఘం

యొక్క

తొమ్మిది లక్షణాలు

4వ ప్రచురణ

మార్క్ ఇ.డివర్

సంఘ సంస్కరణల కేంద్రం

*CENTRE FOR*

# CCR

**CHURCH**

**REFORM**